www.janasakthionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 47 సంచిక : 10 విజయవాడ 20-9-2014 పేజీలు : 8 వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

◈ కార్మిక హక్కులపై ఎన్‌డిఏ పాలకుల దాడి
◈ బహుళజాతి, బడాకార్పొరేట్ల సూపర్‌లాభాలకోసమే బులెట్ రైళ్ళు
◈ ఐసిడిఎస్‌లు ప్రైవేటుపరం
◈ దేశాన్ని మాన్‌శాంటోకు దఖలు పరుస్తున్న పాలకులు
◈ అనంతపురంజిల్లాలో కరువు-రైతుల ఆత్మహత్యలు

## జన్‌ధన్ యోజన జనంపై విసిరిన అప్పుల వల

**ప్రచారార్భాటంతో** ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్‌ధన్ యోజన అన్న ఒక పథకాన్ని ఆగస్టు 15న ప్రకటించారు. 2015 జనవరి 26 నాటికి ఏడున్నర కోట్ల కుటుంబాలకు బ్యాంకు ఖాతాలను తెరవటం, 2016 నాటికి 15 కోట్ల ఖాతాలకు పెంచటాలను ఈ పథకం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ పథకం గురించి బడ్జెటు ప్రసంగంలో అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. పేద కుటుంబానికి రెండు బ్యాంకు ఖాతాలతో నిర్దిష్ట కాలవ్యవధిలో ద్రవ్య సమ్మిళిత పథకం తెస్తామనీ, ఈ ఖాతాలు రుణఅర్హత కలిగి వుంటాయనీ ఆర్థికమంత్రి చెప్పారు. కేంద్ర కేబినెట్ ఒక ద్రవ్య సమ్మిళిత పథకాన్ని ఆమోదించిందనీ దానిని మరునాడు ప్రధాని ప్రకటిస్తారనీ ఆగస్టు 14న ప్రభుత్వ వర్గాలు పత్రికలకు చెప్పాయి. మరునాడు నరేంద్రమోడి ఎర్రకోటపై నుండి ఈ పథకాన్ని ప్రకటించారు.

ఈ పథకం వివరాలు తెలిపే అధికారిక పత్రమేదీ లేదు. పత్రికల్లో వచ్చిన సమాచారాన్ని బట్టే దీని తీరుతెన్నులను పరిశీలించాల్సివుంది. ఈ జన్‌ధన్ యోజనలో నాలుగు ముఖ్యాంశాలున్నాయి. అవి:

1. 7.5 కోట్ల పేద కుటుంబాలకు రెండు చొప్పున 15 కోట్లబ్యాంకు ఖాతాలను తెరవటం.
2. ఈ ఖాతాలో ఉన్న సొమ్మును మించి 5వేల రూ॥ల వరకు సొమ్ము తీసుకునే (ఓవర్‌డ్రాఫ్టు) సౌకర్యం వుంది. రూపే కార్డు యిస్తారు. లక్ష రూపాయల ప్రమాదబీమా వుంటుంది.
3. ఈ ఖాతాలను ఆధార్ కార్డులతో జతకలుపుతారు. వివిధ ప్రభుత్వ సంస్థలందజేసే ఆర్థిక సహాయాన్ని ఈ బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.
4. బ్యాంకుకూ ఖాతాదారునికీ మధ్య సంధానకర్తగా వుండే వాణిజ్య లేఖకుడికి (బిజినెస్ కరస్పాండెంట్‌కు) 5వేల రూ॥ల కనీస ఆదాయం.

ఈ పథకాన్ని ప్రారంభించిన ఆగస్టు 28న దేశవ్యాపితంగా 77,852 ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కోటిన్నర ఖాతాలను బ్యాంకులు తెరిచాయి. ఆ రోజుకు పెట్టుకున్న కోటి ఖాతాల లక్ష్యాన్ని దాటాయి.

ప్రారంభమే విజయపథాన సాగుతున్నదని అరుణ్‌జైట్లీ చెప్పుకున్నప్పటికీ, ఈ పథకం అమలు ముళ్లబాట అన్నది స్పష్టం. ఈ కొత్తగా తెరిచిన ఖాతాలలో 15 నుండి 20 శాతం వరకు ఇంతకుముందే ఖాతాలు వున్నవారేనని బ్యాంకు వర్గాల అంచనా. యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్జిక్యూటివ్ డైరెక్టరు దీపక్ నారంగ్ ఇలా అన్నాడు: "మా దగ్గరి కొచ్చిన ప్రతి ఒక్కరికీ మేము ఖాతాతెరుస్తున్నాము...ద్రవ్య సమ్మిళితంలో లేని వారెవరో నిర్ధారించేందుకు గ్రామ స్థాయిలో సర్వేజరగాల్సివుంది" (ఇకనామిక్ టైమ్స్ 1-9-2014). అంటే ద్రవ్య సమ్మిళితంలో లేనివారెవరో తెలియకుండానే ఖాతాలు తెరిచారు; వచ్చే ఐదు నెలల్లో మరో ఆరుకోట్ల ఖాతాలను బ్యాంకులు కొత్తగా తెరవాలి. 20 శాతంవరకూ ఖాతా వున్నవారే మళ్లీ ఖాతా తెరిచారనుకున్నా, 80శాతం కొత్త ఖాతాలు తక్కువేమీ కాదు. పరిస్థితిలో ఇది చాలా మార్పు తెస్తుంది.

### సాధ్యంకాని లక్ష్యాలు

ఈ పథకం అమలులో ఏర్పడే ఆర్థికభారం ఒక తీవ్ర సమస్య. ఒక ఖాతాకు 5వేల రూ॥ల చొప్పున 15 కోట్ల ఖాతాలకు 75 వేల కోట్ల రూ॥లను వచ్చే నాలుగేళ్లలో బ్యాంకులు వితరణ చేయాల్సి వుంటుంది. ఒక లక్ష రూ॥ల ప్రమాద బీమాకూ, ప్రధాని వాగ్దానం చేసిన 80వేల రూ॥ల జీవిత బీమాకూ ప్రీమియం చెల్లింపు ఎవరు, ఎలా చేస్తారో చెప్పలేదు. పేద కుటుంబాలు ఈ చెల్లింపు చేయలేవన్నది స్పష్టమే. వారి తరఫున ఎవరు చేస్తారన్నదే ప్రశ్న.

ఈ ఖాతా తెరవటంవల్ల వచ్చే సౌకర్యాలన్నీ ఉచితంగా లభ్యమౌతాయన్న భావన ఒకటి విస్తృతంగా వ్యాపింపచేశారు. ఇది వాస్తవంకాదు. ఓవర్‌డ్రాఫ్టుకు 10 శాతం మరియు పాలనాఖర్చు క్రింది 3 శాతం వడ్డి వసూలు చేస్తారు. దీనిలో 6 శాతం వాణిజ్య లేఖకుడికి చెల్లిస్తారు. రూపే కార్డు ద్వారా జరిగే ప్రతి ద్రవ్యలావాదేవీపైనా ఛార్జీలు వసూలు చేస్తారు. రూపే కార్డుద్వారా వచ్చే ఛార్జీల ఆదాయంతో ఈ పథకంలో బీమాకు ప్రీమియం కట్టవచ్చునన్న సూచనలు వస్తున్నాయంటే ఈ ఆదాయం ఎంత ఎక్కువగా వుంటుందో అర్థమౌతుంది.

దేశవ్యాపితంగా ఒక లక్షా 15వేల బ్యాంకు శాఖలున్నాయి. వీటిలో 35 శాతమే గ్రామీణ ప్రాంతాలలో వున్నాయి. అవి కూడా అర్థపట్టణాలే. 2 వేలు అంతకు తక్కువ జనాభాగల 4,90,000 గ్రామాలను బ్యాంకులు లేనివిగా గుర్తించిన రిజర్వుబ్యాంకు 2016 లోపున వీటిని బ్యాంకింగ్ పరిధిలోకి తెచ్చేందుకు వివిధ బ్యాంకులకు అప్పగించింది. రిజర్వుబ్యాంకు ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం బ్యాంకుశాఖకూ, వాణిజ్యలేఖకునకు మధ్య 30 కి.మీ.దూరం మించరాదు; బ్యాంకుశాఖ, వాణిజ్య లేఖకుల నిష్పత్తి 1:6 వుండాలి. దీనిప్రకారం 2016 నాటికి అన్నిబ్యాంకులూ కలిపి కనీసం 80వేల గ్రామీణ శాఖలను తెరవాలి. రిజర్వుబ్యాంకు వార్షిక నివేదిక 2012-13 ప్రకారం గత మూడేళ్లలో అన్నిరకాలు కలిపినా కొత్తగా తెరచిన శాఖలు 7459. గ్రామీణ శాఖలు ప్రారంభించటానికి బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించటం అసాధ్యం.

గ్రామీణ ప్రాంతాల్లో తెరచిన మేరకైనా బ్యాంకుల కార్యకలాపాల నిర్వహణకు తగిన ఏర్పాట్లులేవు. విద్యుత్తు, బ్రాడ్‌బాండ్ ఇంటర్‌నెట్, ఎటిఎంలు వంటి మౌలిక సదుపాయాల అవసరం వుంటుంది. నాబార్డు జరిపించిన ఒక అధ్యయనం ప్రకారం 55శాతం గ్రామాలకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం వుంది. రోజులో ఎన్నిగంటలు సరఫరా అవుతుందన్నది ఊహలకందదు. సెల్‌ఫోన్‌లు విస్తరించాయని ఎంత చెప్పుకున్నా గ్రామాలకు బ్రాడ్ బ్రాండ్ సౌకర్యం తీరని కలే. రూపే కార్డుల వాడకానికి ఏటియంలు కీలకం. దేశంలో లక్షా 60వేల ఏటియంలుండగా, వాటిలో 46వేలు(29శాతం) మహానగరాల్లోనూ, 48వేలు(30శాతం) నగరాలలోనూ వుండగా, 28వేలు(14శాతం) మాత్రమే గ్రామీణ ప్రాంతంలో వున్నాయి. ఈ మౌలిక సదుపాయాల ఏర్పాటు జరగకుండా ద్రవ్యసమ్మిళితం సాధ్యం కాదు.

రిజర్వుబ్యాంకు వార్షిక నివేదిక 2012-13 "ద్రవ్య సమ్మిళితం విజయవంతం కావాలంటే బ్యాంకుశాఖల విస్తరణ, వాటితో సంధానపరిచిన వాణిజ్య లేఖకులు కీలకమౌతాయి" అని పేర్కొంది. ఈ లెక్కన కనీసం 80వేల బ్రాంచీలకూ నలుగురు చొప్పున 3,20,000 మందిని బ్యాంకులు ఉద్యోగులుగా తీసుకోవాలి. మరో 4 లక్షల మందిని వాణిజ్యలేఖకులుగా తీసుకోవాలి. ఇది వాణిజ్యపరంగా బ్యాంకులకు గిట్టుబాటుకాదన్న భావన వుంది. ఈ ఖర్చు ఎవరు, ఎలా భరించాలన్నదే ఎదురైయ్యే సమస్య. Ô

### Ô జనం సొమ్ముతో వ్యాపారం

ఆధార్‌కార్డుతో ఈ బ్యాంకు ఖాతాలను జతకలపటం ద్వారా వివిధ ప్రభుత్వసంస్థలు వితరణచేసే సహాయాన్ని ఈ బ్యాంకు ఖాతాలలో జమచేస్తారు. దీనినే నగదు బదిలీ పథకమంటున్నారు. ఈ ఖాతాలలో జమ అయ్యే నిధుల లావాదేవీలు, ఈ ఖాతాల నిర్వహణ కొరకు బ్యాంకులు పెట్టే ఖర్చులకు సరిపోతాయని వాదిస్తున్నారు. ఇప్పటికి 28 పథకాలు-ప్రధానంగా పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు-ఈ నగదు బదలీపథకం క్రింద వున్నాయి. అతి త్వరలోనే గ్రామీణ ఉపాధిహామీ పథకంక్రింద ఇచ్చే వేతనాలను శ్రామికుల బ్యాంకుఖాతాలలో జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వంటగ్యాసు, ఎరువులవంటి సబ్సిడీలను కూడా నగదు బదిలీ పథకం క్రిందకు 2015 ఆగస్టు నాటికి తెస్తామనీ ప్రకటించింది. ఇదే జరిగితే ఈ ఖాతాలలో వడ్డీ చెల్లించనవసరంలేని సొమ్ము జమ అవుతుంది. ఇవి బ్యాంకులకు వడ్డీలేని డిపాజిట్లుగా వుంటాయి. వీటినుండి వాణిజ్య ఆదాయం జన్‌ధన్ ఖాతాల నిర్వహణకు సరిపోతాయన్నది మరోవాదన.

పై వివరణ జన్‌ధన్‌యోజనకు నిర్దేశించిన లక్ష్యాలు కష్టసాధ్యమనీ, బ్యాంకింగ్‌వ్యవస్థపై భారం మోపుతుందనీ, పథకాన్ని ఆకర్షణీయంగా చేసేందుకు యిచ్చిన తాయిలాలన్నీ (రూపేకార్డు, బీమా సౌకర్యం వగైరా) ప్రజల కష్టార్జితాన్ని ఛార్జీలూ, వడ్డీలపేరిట **(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

## కన్నీటి కాశ్మీర్

**భారత-పాకిస్తాన్** సరిహద్దుకు యిరువైపులా వున్న కాశ్మీర్ గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్ర వరదకు గురయ్యింది. కాశ్మీరు ప్రజలకు ఎనలేని కష్టాలను కొనితెచ్చింది. ఇప్పటికందిన వార్తల ప్రకారం 239మంది మృతిచెందారు. జమ్మూ, కాశ్మీర్, గిల్గిత్, బాల్టిస్తాన్‌లలో వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. శ్రీనగర్ పట్టణాన్ని వరద ముంచెత్తింది. లక్షలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించవలసి వచ్చింది.

గత ఏడాది వరద బీభత్సానికి ఉత్తరాఖండ్ గురైంది. ఈ ఏడాది కాశ్మీర్. గత కొన్నిఏళ్లుగా వరదలవల్ల వినాశనం వార్తలు తరచుగా వస్తున్నాయి. వాతావరణ మార్పుల ఫలితంగా సీజనుకాని సమయంలో అత్యధిక వర్షపాతం సంభవించటంతో ప్రజలూ, ప్రభుత్వమూ సంసిద్ధంగా లేనందున నష్టం జరిగిందని నిపుణులు వాదిస్తున్నారు. ఇదెంత వరకూ వాస్తవం?

ప్రభుత్వ అసంసిద్ధత కాదుగానీ నిర్లక్ష్యమన్నది వాస్తవం. వర్షపాతాన్ని మించి వరదలు తెచ్చిన వినాశనమే దీనికి నిదర్శనం. ఉదాహరణకు శ్రీనగర్ పట్టణం. ఉత్తరాఖండ్‌లో ఒక ప్రణాళిక లేకుండా సాగిన భవన నిర్మాణం వరద బీభత్సాన్ని పెంచిన తీరులోనే శ్రీనగర్ కూడా వరద తాకిడికి గురైంది. నగరం చుట్టూవున్న చిత్తడి భూములు, కాలువలు ఆక్రమణకు గురవుతుంటే భవనాలు, హోటళ్లూ, వాణిజ్య సముదాయాలూ అక్కడ వెలుస్తుంటే చూస్తూ కూర్చున్నది ప్రభుత్వం. నగరంలోని కాలువలను రహదారులుగా మార్చారు. దీనితో జీలం నది వరదకు ప్రవహించే మార్గాలు తగ్గి శ్రీనగర్‌ను ముంచెత్తాయి.

ఈ సమస్య కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు తెలుసు. వూలార్ సరస్సులో పూడిక తొలగించటానికీ, చిత్తడి భూములూ, చెరువులు ఆక్రమణకు గురికాకుండా నిరోధించటానికీ 2010లోనే ప్రణాళికలు రూపొందించారు. అవి ఏనాడూ అమలు చెయ్యలేదు. ప్రణాళికా రహిత నగర విస్తరణా, నీటి నిల్వ వనరుల ఆక్రమణా కాశ్మీరుకే పరిమితం కాదు. దేశంలోని పట్టణాలూ, నగరాలూ ఈ సమస్య నెదుర్కొంటున్నాయి. పథకాల రచన సాగుతోందిగానీ అవి అమలుకు నోచుకోవటంలేదు.

వరదల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ వుండివుంటే ఈ వినాశనాన్ని కొంతమేరకు తగ్గించగలటం సాధ్యమయ్యేది. డ్యాములు, రిజర్వాయర్లు లేవు గనుక కేంద్రజలసంఘం ఇక్కడొక స్టేషన్ నిర్మాణం అవసరంలేదని పెట్టలేదు. దీనితో వరద అంచనా, ముందస్తు హెచ్చరికా లేకుండాపోయాయి. వాతావరణశాఖ వర్షపాత ప్రకటనలు తప్ప మరే ముందస్తు అంచనాలకు రాష్ట్రంలో ఒక వ్యవస్థ లేకుండాపోయింది.

వరదల అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలు కూడా అస్తుబిస్తుగానే సాగాయి. ప్రధాన వార్తా పత్రికలూ, టి.వి.ఛానెళ్లు సహాయక చర్యల్లో సైన్యంపాత్రను ఎక్కువగా ప్రసారం చేశాయి. కాశ్మీరీ వేర్పాటువాదుల బాధలు, రక్షించిన వారిపట్లవారి "కృతజ్ఞత"లేమి మీద కేంద్రీకరించి వార్తలిచ్చాయి. భారత పాలకుల సంకుచిత్వానికిది నిదర్శనం.

భారత కాశ్మీర్‌కు సహాయమందిస్తామని పాకిస్తాన్ ప్రధాని షరీఫ్, పాకిస్తాన్ కాశ్మీరుకు సహాయమందిస్తామని భారత ప్రధాని మోడీ ప్రకటనలైతే యిచ్చారుగానీ అంతకు మించి ఒక్కడుగుకూడా ముందుకు వెయ్యలేదు. సహాయ చర్యలను కలగలిసి చేసుకునే వైపుగా ఆలోచించలేదు. ప్రకటనలతో పైచేయి సాధించే బూటకపు జాతీయతా ప్రదర్శనలో పోటీతప్ప ప్రజల యిడుములలో సహాయ హస్తం అందించే దిశగాగానీ, ఇలాంటి దుస్థితి తిరిగి ఏర్పడకుండా నివారించే మార్గాల అన్వేషణకు చర్చలకుగానీ పూనుకోలేదు.

ప్రకృతి వైపరీత్యాలను ఆపలేము. అయితే వాటిని నివారించటానికి తగిన ప్రణాళికలు రూపొందించి, అమలు చేయవచ్చు. అలాగే ప్రకృతి వైపరీత్యాలవల్ల జరిగే ప్రాణ, ఆస్థి నష్టాన్ని కనీసస్థాయికి కుదించగల అవకాశాలూ వున్నాయి. ప్రణాళికబద్ధ సమగ్ర విపత్తు నిర్వహణా విధానం, వ్యవస్థ ఆవశ్యకతను మరోసారి కన్నీటి కాశ్మీర్ తెలుపుతున్నది.

## జన్‌ధన్ యోజన...(మొదటిపేజీ తరువాయి)

కాజేసేవనీ, బ్యాంకులకు వడ్డీ చెల్లించనవసరంలేని నిధులను సమకూరుస్తుందని తెలుపుతుంది.

ద్రవ్య సమ్మిళితం పేరిట ఈ పథకాన్ని పాలకవర్గాలు ఎందుకు ముందుకు తెస్తున్నాయి? ప్రపంచబ్యాంకువంటి సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు దీనినెందుకు సమర్ధిస్తున్నాయి? అసలీ ద్రవ్య సమ్మిళితం అంటే ఏమిటి? దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమిటి?

పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిక్రమంలో ద్రవ్యపెట్టుబడి పైచేయి సాధించి, ఆర్ధికవ్యవస్థ మొత్తాన్ని నిర్దేశించేస్థాయికి చేరుతుంది. ఈ ద్రవ్య పెట్టుబడి లాభార్జనా ప్రయత్నాలలో ఆర్ధిక, ద్రవ్య వనరులన్నింటినీ తన ఆధీనంలోకి తెచ్చుకుంటుంది. ప్రజల పొదుపు సొమ్మును తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అది అనేక పద్ధతులను వాడు కుంటుంది. బ్యాంకులు డిపాజిట్లు, బీమా ప్రీమియంలు, పెన్షన్ నిధులు వీటిలో కొన్ని. డబ్బు పిల్లల్ని పెట్టదు. బడాపెట్టబడిదారులకు ఈ సొమ్మును అప్పుగా యివ్వటంతోపాటు ప్రజలను కూడా అప్పులు తీసుకునే విధంగా చేయటంద్వారా లాభార్జన చేస్తాయి. ఈ అప్పులు, వడ్డీలు, వసూళ్లు ఎంతగా సంస్థాగత రూపం తీసుకుంటే పెట్టుబడిదారులకు అంతగా లాభాలు పెరుగుతాయి. దీనికి మరోపేరే ద్రవ్య సమ్మిళితం.

### గత అనుభవం

ఈ ద్రవ్య సమ్మిళితమన్న పదం నూతన ఆర్ధిక విధానాల తరువాత తరచుగా వినపడుతున్నది. అయితే నిజమైన అర్ధంలో ఇది అంతకుముందే ప్రారంభమైంది. 1964లో 14 వాణిజ్య బ్యాంకులను ఇందిరాగాంధీ జాతీయం చేయటంతో ఇది మొదలయింది. అప్పటివరకూ బ్యాంకులు నగరాలకూ, పెద్దపట్టణాలకే పరిమితమయ్యాయి. ఈ ప్రైవేటు బ్యాంకులు విస్తరించి, మిగిలిన ప్రాంతాలలో ద్రవ్య వనరులను సమీకరించవన్న నిర్ధారణతో వీటిని జాతీయం చేశారు. జాతీయ బ్యాంకులు చిన్న పరిశ్రమలకూ, రైతాంగానికి రుణాలు అందజేస్తాయని చెప్పుకున్నారు. కానీ జరిగిందేమిటి? బ్యాంకుల గ్రామీణప్రాంత శాఖలు పెరిగాయి. ప్రత్యేకంగా గ్రామీణ బ్యాంకులూ ఏర్పడ్డాయి. రిజర్వుబ్యాంకు, ప్రణాళికాసంఘాల నివేదికల ప్రకారమే గ్రామీణ ప్రాంతాలనుండి ఇవి సమీకరించిన నిధులలో 30 శాతాన్ని మించి ఆ ప్రాంతంలోనే రుణాలుగా యివ్వలేదు. జాతీయ బ్యాంకులు ప్రాధాన్యతా రంగంగా చిన్న పరిశ్రమలకూ, వ్యవసాయానికి నిర్దేశించిన 18 శాతాన్ని మించి ఏనాడూ రుణం యివ్వలేదు. రైతాంగ రుణ అవసరాలలో బ్యాంకులిచ్చింది 20శాతం మాత్రమే. చిన్న పరిశ్రమల స్థితి ఇలాగే వుంది. గ్రామీణ ప్రాంతాలలో నుండి బ్యాంకులు సేకరించిన ఈ ద్రవ్య నిధులలో 76శాతం సేవింగ్స్ ఖాతాలోనే వున్నాయి. అంటే వీటికి చెల్లించేది నామమాత్రపు వడ్డీయే. ఈ గ్రామీణ ప్రాంత నిధులను నగరాలకూ, పరిశ్రమలకూ తరలించారు. ఇది వ్యవసాయరంగంలో పెట్టుబడి మదుపును తగ్గించింది. తక్కువ వ్యయ గ్రామీణ నిధులతో బ్యాంకులు లాభాలు గడించాయి. బడాబూర్జువాలకు నిధులు సమకూర్చాయి. వారు ఎగ్గొడితే పారుబాకీల క్రింద రద్దుచేశాయి. గత ఆర్ధికమంత్రి చిదరంబరం ఒక సందర్భంలో మాట్లాడుతూ బ్యాంకుల పారు బాకీలలో అత్యధిక భాగం 30 కుటుంబాల రుణం తిరిగి చెల్లించనందునే ఏర్పడ్డాయనీ, వారి పేర్లు చెప్పననీ అన్నాడు. ఆవిధంగా ప్రజల పొదుపును బడాబూర్జువాలకు కట్టబెట్టడంగా ద్రవ్య సమ్మిళిత మొదటి దశ సాగింది. నూతన ఆర్ధిక విధానాలు ప్రారంభమయ్యేవరకూ గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకు బ్రాంచీల సంఖ్యను పెంచటమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

### చిన్నమొత్త రుణాలపై కన్ను

బ్యాంకుశాఖలు పెరిగినప్పటికీ చిన్నస్థాయి రుణాలివ్వటానికి బ్యాంకులు సుముఖత చూపలేదు. వడ్డీ దాదాపుగా లేని చిన్న డిపాజిట్ల సొమ్ముతో పెద్దస్థాయి రుణాలు యివ్వటం సాగించాయి. సామాన్యపౌరుల, చిన్న వ్యాపారుల, చిన్న పెట్టుబడిదారుల రుణ అవసరాలను తీర్చలేక పోయాయి. వీరు ప్రధానంగా ప్రైవేటు వడ్డీ వ్యాపారులమీదే ఆధారపడాల్సి వచ్చింది. దీనితో బ్యాంకేతర ద్రవ్యసంస్థలు (మామూలు మాటల్లో చిట్‌ఫండ్ కంపెనీలు) ప్రైవేటు రంగంలో విస్తరించాయి. 1990ల చివరి కొచ్చేసరికి సూక్ష్మరుణ సంస్థలు రంగంలోకి వచ్చాయి. చిన్న మొత్తాలలో రుణాలందజేసి ఇవి రెండు రెట్లు లాభాలు గడించటమేకాక వేలకోట్ల వాణిజ్యాన్ని సాగించాయి. దీనితో చిన్న రుణాల వాణిజ్యాన్ని క్రమబద్ధీకరించటం పేరిట రిజర్వుబ్యాంకు ఈ రంగాన్ని బ్యాంకుల పరిధిలోకి తెచ్చేందుకు పూనుకుంది.

బ్యాంకింగ్ రంగ సంస్కరణలకోసం రిజర్వు బ్యాంకు నచికేత్ మోర్‌కమిటీని నియమించింది. “చిన్న వ్యాపారం, అల్పాదాయ కుటుంబాలకు సమగ్ర ద్రవ్య సేవలు” అందించాలంటూ అది సూచనలు చేసింది. పేద, బలహీన వర్గాలను ద్రవ్య మార్కెట్టులోకి లాగేందుకు, మార్కెట్టు పద్ధతులతో సాగే సాధనాలను వినియోగించాలని సూచించింది. దీనినే రిజర్వుబ్యాంకు నివేదికలో “ప్రస్తుతం బ్యాంకుల పరిధికి బయటనున్న పట్టణ, గ్రామీణ వినియోగదారులకు ఆకర్షణీయ సాధనాలనూ, అందించే పద్ధతులనూ, అభివృద్ధిచేయటంద్వారా ద్రవ్య సమ్మిళితం ద్రవ్య స్థిరత్వం కలిసికట్టుగా సాగేందుకు అవసరమైన క్రమబద్ధీకరణ చట్రాన్ని రూపొందించేందుకు ఒక సలహా సంఘాన్ని నియమిస్తున్నట్లు” వివరించింది. పేద, బలహీన వర్గాలకు సహాయమన్న అంశం ఇందులో లేదు. మొత్తం పదజాలమంతా మార్కెట్టు వాణిజ్య పదజాలమే. అంటే లాభనష్టాల పరిభాష. ప్రస్తుత రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురామ్‌రాజన్ మాటల్లో ఇది మరింత స్పష్టమౌతుంది. ద్రవ్య సమ్మిళితం అంటే ఆయన నిర్వచనం ఐదు “పి”లు– ప్రాజెక్టు (పథకం), ప్లేస్(స్థలం), ప్రైస్(ధర), ప్రొటెక్షన్ (రక్షణ), ప్రాఫిట్(లాభం). బ్యాంకులకు లాభాలు వచ్చేవిధంగా రక్షణ కల్పించే ధరను స్థలాన్నిబట్టి పథకాన్ని రూపొందిస్తారు.

దీని అమలు గమనిస్తే ఈ “పి”ల సంగతి పూర్తిగా అర్ధమౌతుంది. ద్రవ్య సమ్మిళితవల్ల బ్యాంకులకు లాభం రావాలి. కనుక బ్యాంకులకు ఖర్చులు పెంచే శాఖలు ఏర్పాటుచేయకుండా వాణిజ్య లేఖకులను నియమిస్తారు. వీరిద్వారా జరిగే లావాదేవీలన్నింటికీ వారికి కమీషన్ చెల్లిస్తారు. దీనిని ఖాతాదారు నుండి వసూలు చేస్తారు. రుణాల తిరిగి చెల్లింపు జరగక పోతే బ్యాంకు నష్టపోకుండా క్రెడిట్ గ్యారంటి ఫండ్ (రుణ హామీనిధి) ఏర్పాటుచేస్తారు. వెయ్యికోట్ల మూలనిధితో దీనిని నాబార్డు నిర్వహిస్తుంది. రుణంపై వసూలుచేసే వడ్డీకి 1 శాతం అదనంగా వసూలు చేసి ఈ నిధికి జమచేస్తారు. అంటే పేదవర్గాలే వడ్డీ రూపంలో ఈ భారాన్ని మోయాలి. (ఇదీ రక్షణ–బ్యాంకులకు) ఇక మరో ‘పి’ ధర. ఇంతవరకూ బ్యాంకులు తీసుకునే డిపాజిట్లు, ఇచ్చే రుణాలకు వడ్డీరేట్లను రిజర్వుబ్యాంకు నియంత్రించేది. రిజర్వుబ్యాంకు నిర్ణయించిన వడ్డీరేటునే బ్యాంకులు అమలు చేయాలి. చిన్న మొత్తాల రుణాలను వడ్డీరేటు నియంత్రణ నుండి తప్పించారు. వీటికి వడ్డీరేట్లను బ్యాంకులే నిర్ణయించుకుని వసూలు చేసుకోవచ్చు. “సూక్ష్మరుణ సంస్థల అనుభవాన్ని గమనిస్తే చిన్న మొత్తం రుణాలు బ్యాంకులకు అత్యంత ఆకర్షణీయంగా వుంటా” యంటూ జన్‌ధన్ యోజనా సమర్ధకులు వాదిస్తున్నారు. అంటే బ్యాంకులు అధిక వడ్డీరేట్లను వసూలుచేసుకునే అవకాశం కల్పించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారం నుండి సంస్థాగత వడ్డీవ్యాపారానికి పేదలను మార్చటమే ద్రవ్య సమ్మిళితానికి అర్ధం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్దనున్న ద్రవ్య నిధులను బ్యాంకులకు మారిస్తే, అవి బడాబూర్జువా వర్గానికీ, సామ్రాజ్యవాద పెట్టుబడికి మరింతగా సేవ చేస్తాయి.

మధ్యతరగతి ప్రజల పొదుపు సొమ్ము అయిన జీవిత బీమా నిధులను విదేశీ కంపెనీల బడాబూర్జువాల పరం చేశారు. పెన్షన్ నిధులను వారి పరంచేసే క్రమం మొదలై సాగుతున్నది. పేద వర్గాల రుణ అవసరాలను తీర్చటం పేరిట వారిని అప్పుల వలలోకి లాగటమే ద్రవ్య సమ్మిళిత నినాదం.

జన్‌ధన్‌యోజనతో ప్రతి కుటుంబానికి బ్యాంకుఖాతా ఏర్పడి, వారికి రుణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందనీ, వారి పొదుపు పెరుగు తుందనీ, అందువల్ల వారి జీవితాలు మెరుగు పడతాయనీ నమ్మబలుకుతున్నారు. వాస్తవాన్ని చూడని వాదన యిది. ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్య – స్థిరమైన ఉపాధి లేకపోవటం; దానినుండి స్థిరమైన ఆదాయం లేకపోవటం. అధికారిక లెక్కల ప్రకారమే 40శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన వున్నారు. వారి రోజువారి ఆదాయం కనీస అవసరాలకు కూడా సరిపోదు. పేదరైతాంగం అన్నివైపులనుండీ దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వీరికి బ్యాంకు ఖాతా తెరిస్తే, దానిలో దాచుకునేందుకు సొమ్మెక్కడి నుండి వస్తుంది? వడ్డీ వ్యాపారుల బదులు బ్యాంకులనుండి అప్పుతీసుకొమ్మని చెబుతున్నారు. ప్రభుత్వంనుండి బలహీన వర్గాలకు అందే సహాయం బ్యాంకుల పరం చేస్తామంటున్నారు. మార్కెట్టు శక్తులు దుర్బలురను అణచివేస్తాయన్నది జగమెరిగిన సత్యమే. మార్కెట్టు శక్తులనుండి బలహీనవర్గాలకు ఎలాంటి రక్షణా కల్పించకపోగా, ప్రభుత్వరంగ బ్యాంకులను కూడా మార్కెట్టు శక్తుల తరహాలోనే పనిచేసే స్వేచ్ఛనిస్తోంది. పేదల ఆదాయాన్ని, మధ్యతరగతి ప్రజల పొదుపునూ కొల్లగొట్టి, బడాబూర్జువా వర్గానికి కట్టబెట్టుతూ వస్తున్న ప్రభుత్వాలు దీనికోసం వెతికిన మరో పథకమే జన్‌ధన్ యోజన. ✶

## కార్మికుల హక్కులు... (మూడవ పేజీ నుండి)

చేయవలసివుండగా 50 మందికి పైగా కార్మికులుంటేనే వర్తించే విధంగా చట్టసవరణకు రాజస్థాన్ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

ప్రస్తుతం విద్యుత్తు సరఫరా లేకుండా 20మంది కార్మికులు పనిచేసే ఆవరణలో ఫ్యాక్టరీచట్టం వర్తిస్తుంది. దీనికి బదులుగా, విద్యుత్తు సరఫరా వుండి 40 మంది కార్మికులు పనిచేసే ఆవరణలకే వర్తించే విధంగా సవరణలు చేస్తున్నారు. ఈ సవరణలన్నీ కార్మికుల వేతనాలు దిగకోసేందుకు, ఉద్యోగ భద్రత – పనిభద్రత ప్రమాణాలను తగ్గించేందుకు మరియు పారిశ్రామిక, కార్పోరేటు యాజమాన్యాలకు తోడ్పడేవే!

పారిశ్రామిక విధానం మరియు ప్రోత్సాహక విభాగం (డి.ఐ.పి.పి) నేషనల్ ఇన్‌వెస్టుమెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లలో (ఎన్.ఐ.ఎమ్.జెడ్) కార్మికులను విధులనుండి తొలగించేందుకు కాంట్రాక్టు కార్మికచట్టం, పారిశ్రామిక వివాదాల చట్టాలలో మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదించింది. అదే విధంగా ఎన్.ఐ.ఎమ్.జెడ్‌లలో తొలగించబడిన కార్మికులకు నష్టపరిహారాన్ని అందించేందుకు ఓ నిధిని ఏర్పాటు చేయాలని, సంబంధిత ఎన్.ఐ.ఎమ్.జెడ్.లు కార్మిక సంబంధిత చట్టాలను పరిశీలించేందుకుగానూ ఓ ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలని ప్రతిపాదించింది. హర్యానా, యు.పి., గుజరాత్, ఎమ్.పి, రాజస్థాన్, మహారాష్ట్రలలో ప్రభుత్వ ఆదేశానుసారం ఎన్.ఐ.ఎమ్.జెడ్.లు ఏర్పాటు చేస్తారు.

మహిళలను రాత్రివేళ విధులలో నియమించే చట్టాన్ని, ప్రమాదకర పని ప్రదేశాలలో నియమించటాన్ని నిరోధిస్తున్న, ప్రస్తుతం ఉనికిలోవున్న ఫ్యాక్టరీచట్టం–1948ని సవరించి మహిళా కార్మికులకు రాత్రివేళ డ్యూటీలు విధించే సవరణలతో కేంద్ర ప్రభుత్వ కార్మికశాఖ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. మహిళా కార్మికులకు రాత్రివేళలలో డ్యూటీలపై నిషేదాన్ని కొన్ని మహిళాసంఘాలు వ్యతిరేకించటాన్ని ఉదాహరణగా చూపుతూ స్త్రీ, పురుషులకు సమానావకాశాలు కల్పిస్తున్నామనే పేరిట ఈ ప్రతిపాదనలను సమర్ధించు కుంటున్నారు. మహిళలపై లైంగికదాడులు, హింసల నుండి ఏ విధమైన రక్షణాలేని వాతావరణంలో మనమున్నాం. ప్రస్తుత ఈ ప్రతిపాదన మహిళా కార్మికులకు అదనపు కష్టాలను తెచ్చిపెడుతుంది. కార్మికశాఖ కూడా ఓవర్‌టైమ్‌ను 50 గంటల నుండి 100 గంటలకు పెంపు చేసేందుకు ప్రతిపాదిస్తున్నది. ఈ ప్రతిపాదన నిస్సందేహంగా కార్మికులను మరింతగా దోచుకునేందుకు యాజమాన్యాలకు అనుమతి నీయటమే. కార్మికులను విధుల నుండి పూర్తిగా తొలగించటానికి వీలులేకుండా ప్రస్తుత కార్మిక చట్టాలలో ఏ మేరకైనా వారి ఉద్యోగ భద్రతకు అవకాశాలుండేట్లయితే, సంబంధిత చట్టాలలో అలాంటి అవకాశాలన్నింటనీ తొలగించే విధంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వశాఖ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది.

కేంద్ర కార్మికశాఖ మంత్రి తోమర్ మాట్లాడుతూ కార్మిక అశాంతి కారణంగా పరిశ్రమలు నష్టపోకుండా వుండేందుకు హామీనిస్తూ కేంద్రప్రభుత్వం అందుకు బాధ్యతవహిస్తుందని నొక్కిచెప్పాడు. అతను ఇంకా మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలకు పరిశ్రమలు హాని కలిగించరాదన్నాడు. కానీ ఇది కంటితుడుపు మాటే! పారిశ్రామిక అభ్యున్నతికి తోడ్పడే వాతావరణాన్ని కల్పించవలసిందిగా తమ ప్రభుత్వం కార్మిక యూనియన్లను కోరిందని ఆయన పేర్కొన్నాడు. అయితే తమ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తుందని అతనెక్కడా హామీ నివ్వలేదు.

**యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా కార్మిక చట్టాలను సవరించి, పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను నెరవేర్చే తమ ఉద్దేశాలను సమర్ధించుకునేందుకు 2013–14 ఆర్ధిక సర్వేను ఆధారంగా చేసుకొని ‘భారతదేశంలో భారీస్థాయి తయారీ రంగ అభివృద్ధికి కార్మిక చట్టాలు అడ్డుగా నిలుస్తున్నాయనే’ ప్రకటన చేస్తూ ‘రెండో తరం సంస్కరణలు’ చేసేందుకు వీలుగా కఠినతర కార్మికచట్టాలను పునర్ నిర్వచించాలని కార్మికశాఖ సిఫార్సు చేసింది.**

కార్మికులకు నాణ్యతగల ఉద్యోగాలు కల్పించాలని; స్వయం ఉపాధిగా చెప్పబడే, వేతన చెల్లింపులేని ఆర్ధిక కార్యకలాపాల సవాళ్ళను ఎదుర్కోవాలని; వివిధ రంగాలలో చట్టబద్ధ కనీస వేతనాన్ని అమలుపరచాలని; అనియత, అసంఘటిత రంగాలలోని కార్మికులకు నియత, సంఘటిత రంగాలలోని కార్మికులతో సమానంగా హుందా అయిన పనిని, వేతనాన్ని, సామాజిక సదుపాయాలను కల్పించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ) స్పష్టంగా, నిర్దిష్టంగా పేర్కొంది. ఈ సూచనలకు నరేంద్ర మోడి నాయకత్వంలోని నూతన ఎన్.డి.ఏ.ప్రభుత్వం చేపట్టున్న ఈ చర్యలన్నీ – వ్యతిరేకమైనవే! బి.జె.పి ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, బడాపెట్టుబడిదారీ వర్గం నిర్దేశించిన విధంగా వారి మార్గదర్శకత్వంలోనే నడుస్తున్నదని స్పష్టమౌతోంది.

ఇటీవలి కాలంలో మారుతీ సుజుకి కార్మికులు, మరికొన్ని పరిశ్రమల కార్మికులు కఠినమైన ఆందోళనలను, పోరాటాలను నిర్వహిస్తూ వస్తున్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిజేసే కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలనే అంశం ఈ సందర్భంగా బలంగా ముందుకు వచ్చింది. ఇలాంటి చర్య బడాపెట్టుబడిదారుల ప్రయోజనాలకు వ్యతిరేకమైనది గనుక ఎన్.డి.ఏ. పాలకులు అటువంటి ఆలోచనే చేయబోరని స్పష్టమౌతోంది.

**ఈ విధంగా ఎన్.డి.ఏ కొత్త తరహాలో నినాదాలివ్వటం మినహా గత యు.పి.ఏ.కు ఏ విధంగానూ భిన్నమైనదికాదని నిరూపించుకుంది. కనుక, ఎన్.డి.ఏ ‘సుపరిపాలన’ను గురించి అభివృద్ధి పథకాల గురించి కార్మికులకు ఏ విధమైన అపోహలూ ఉండాల్సిన అవసరం లేదు. ఈ పరిస్థితులలో కార్మికులు మరింత జాగరూకులై రానున్న కాలంలో కార్మికవర్గంపై జరగనున్న దాడులను ఐక్యంగా ఎదుర్కొనేందుకు, ధృఢంగా నిలిచి వాటిపై పోరాడేందుకు సంసిద్ధం కావాలి.**

**(క్లాస్ స్ట్రగుల్ 2014 ఆగస్టు సంచిక నుండి)**


**సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి**



రచన : **జి.యన్. సెరిబ్రెన్నికోవ్** అనువాదం : **తోలేటి జగన్మోహనరావు**

ప్రచురణ : **తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్** వెల : **రూ.120/-**

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్**

**28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2**

# కార్మికుల హక్కులు, ప్రయోజనాలపై ఎన్.డి.ఏ. పాలకుల దాడి ప్రారంభమైంది – తస్మాత్ జాగ్రత్త!

**2014** మార్చి 13న కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలకు (సి.ఐ.ఎస్.ఎఫ్) చెందిన ఓ పోలీసు జరిపిన తుపాకి కాల్పులలో నైవేలీ లిగ్నైట్ కార్పోరేషన్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికుడొకరు మరణించారు. గనుల విభాగంలోని ఆ కార్మికుడు మైన్–2లో పని చేస్తున్న తన స్నేహితుడిని కలవటానికి మధ్యాహ్నం 12 గంటలకు వెళ్ళాడు. ప్రధాన ద్వారం వద్ద కాపలాగావున్న సి.ఐ.ఎస్.ఎఫ్ బలగాలు అతనిని లోనికి వెళ్ళనీయక పోవడమేకాక, అక్కడి నుండి ఫోన్ చేయటానికి కూడా అనుమతి నివ్వలేదు. ఈ క్రమంలో ఆ భద్రతా విభాగపు పోలీసు, బులెట్లు నింపిన తుపాకిని నేరుగా రాజ్‌కుమార్ తలపైకి ఎక్కుపెట్టి మూడుసార్లు కాల్పులు జరిపాడు. తల ఛిద్రమై ఆ కార్మికుడు అక్కడే కుప్పకూలి మరణించాడు. క్రూరమైన, దుర్మార్గమైన ఈ హత్యను మరుగుపరిచే, ఉద్దేశపూర్వక మోసకారి ప్రయత్నంలో భాగంగా విధుల్లోవున్న సి.ఐ.ఎస్.ఎఫ్ సిబ్బంది, మైన్–2 నుండి తమ విధులు ముగించుకొని బయటకువస్తున్న కార్మికులపై వుట్టి పుణ్యానికి విరుచుకుపడి, విచ్చలవిడిగా లాఠీఛార్జీ చేశారు. కార్మికుల ఆందోళనను అణచే చర్యలలో భాగంగా రాజకుమార్‌పై కాల్పులు జరిపినట్లు, అందులో అతను మృతి చెందాడనే కథను అల్లేందుకు వారు ఈ చర్యకు దిగజారారు. ప్రధాన ద్వారం –2 వద్ద సిసి కెమేరాలలో నమోదైవున్న సాక్ష్యాన్ని రూపుమాపేందుకు ఆ కెమేరాలను ఉద్దేశపూర్వకంగా ముక్కలు ముక్కలు చేశారు. పోలీసులదాడి సంఘటన గురించి తెలిసి ద్వారానికి వెలుపలనున్న కార్మికులు ఆగ్రహంతో ద్వారం బయట జమకూడి, నిరసన తెలియజేస్తుండగా వారిపై క్రూరంగా, దారుణంగా లాఠీఛార్జీ జరపటం ఈసారి తమిళనాడు రాష్ట్ర పోలీసుల వంతైంది.

2014 మే 8న వై.ఎస్.ఐ.లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుడైన బాలాజి అనే వెల్డర్ 3సం॥ సర్వీసు అనంతరం 'ట్రైనర్'గా పదోన్నతని పొందాడు. అంటే స్థిర ఉద్యోగానికి దగ్గరగా వెళ్ళాడన్నమాట. వై.ఎస్.ఐ అనే ఈ ఆటో విడిభాగాల తయారీ కంపెనీ హూండాయ్ కంపెనీకి అవసరమైన స్ప్రింగు పరికరాల వంటి కొన్ని విడిభాగాలను సరఫరా చేస్తుంది. కాగా, పదోన్నతి పొందిన ఈ బాలాజీ అనే కార్మికుడు కంపెనీలోనే ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీనికి కారణమేమంటే, అతనిని స్థిర ఉద్యోగిగా గుర్తించటం కాకుండా, అతన్ని ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లుగా ఉత్తర్వులు చేతికందించటంతో, మానసికంగా షాక్‌కు గురై నిస్పృహతో పనిప్రాంతంలో లభ్యమయ్యే పెయింట్‌ను పలుచబరిచే ద్రావణాన్ని తాగి ఈ చర్యకు పాల్పడ్డాడు. వెనువెంటనే యాజమాన్యం పోలీసు రిపోర్టు వంటివేమీలేకుండా అతనిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యసౌకర్యం అందించారు. ఆ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయలేదంటూ, ఏదో కొన్ని చుక్కలు ద్రావణాన్ని పొరపాటున తాగాడంటూ ఆసుపత్రి యాజమాన్యం నుండి అప్పుడే ఓ సర్టిఫికెట్‌ను తీసుకున్నారు. సహజంగానే ఆసుపత్రి అధికారులు కంపెనీ యాజమాన్యానికనుగుణంగా వ్యవహరించారు. బాలాజీ ఆత్మహత్యాయత్నం చేయలేదనే సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత కంపెనీ యాజమాన్యం అతనిని అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. డబ్బు చెల్లించకుండా వైద్యం కొనసాగించేందుకు ఆసుపత్రి వైద్యులు అంగీకరించలేదు. దానితో బాలాజీ కుటుంబ సభ్యులే అప్పోసొప్పోజేసి అతనికి వైద్యం చేయించారు. పని ప్రదేశంలో బాలాజీ ఆత్మహత్యా ప్రయత్నం చేయలేదని, ఆ విధంగా నటించాడని యాజమాన్యం వాదిస్తోంది. ఈ అమానవీయ, నిజాయితీహీనమైన కంపెనీ యాజమాన్య చర్యకు నిరసనగా బాలాజీ సహకార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆందోళన చేస్తున్న ఈ కార్మికులను యాజమాన్యం తాత్కాలికంగా విధులనుండి తప్పించి, ఆరుగురిపై తప్పుడు కేసు బనాయించింది.

2014 ఏప్రిల్ 15న, రాజస్థాన్ రాష్ట్రం – భివాండి ప్రాంతంలోని శ్రీరామ్ పిస్టన్ అండ్ రిగ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న వెయ్యిమంది కార్మికులు టూల్ డౌన్ ప్రకటించి, పరిశ్రమ ఆవరణలోనే సమ్మెచేస్తూ, యాజమాన్య చర్యలను నిరసించారు. రాజస్థాన్ ప్రభుత్వ ట్రేడ్‌యూనియన్ల రిజిస్ట్రేషన్ విభాగాన్ని ప్రభావితం చేసి, కార్మికుల యూనియన్‌ను రిజిస్టర్ కాకుండా యాజమాన్యం అడ్డుపడటాన్ని ఈ కార్మికులు నిరసించారు. పోలీసు బలగాలు, బౌన్సర్స్, భద్రతా దళాలు, సంఘ వ్యతిరేక శక్తులు కలగలసి యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై క్రూరంగా లాఠీఛార్జీ జరిపి, దాడులుచేసి వందమందికిపైగా కార్మికులను తీవ్రంగా గాయపరిచారు. యాజమాన్యం తెచ్చిన కిరాయిరౌడీల కాల్పులలో, కత్తిపోట్లలో అనేకమందికి తూటాల గాయాలు, తీవ్ర రక్తస్రావాలు అయ్యాయి. మారుతి, హోండా మోటార్‌సైకిల్, హోండా మోటార్ కార్పొరేషన్ మరియు ఇతర పెద్ద ఆటోకంపెనీలకు పిస్టన్‌లను, ఇతర ఆటో విడి భాగాలను భివాండిలోని ఈ శ్రీరామ్ పిస్టన్స్ అండ్ రిగ్స్ పరిశ్రమ సరఫరా చేస్తోంది.

2014 జూన్ 16న, ఉత్తరప్రదేశ్‌రాష్ట్రం – ఝాన్సీ వద్దనున్న ఆప్తి అనే గ్రామంలోని ఓ పని ప్రదేశంలో పనిచేయటానికి నిరాకరించిన కారణంగా 17 సం॥ కార్మికుడిని ఆ భవన నిర్మాణ సంస్థకు చెందిన గూండాలు చావుదెబ్బలు కొట్టారు. అతని సోదరుడిని కూడా తీవ్రంగా గాయపరిచారు.

2014 జూన్ 23న, ఒడిషారాష్ట్రం – జైపూర్ జిల్లాలో కళింగనగర్ వద్దనున్న ఉక్కు కర్మాగారంలో భద్రతాదళాలు క్రూరంగా జరిపిన లాఠీఛార్జీలో, తుపాకి కాల్పులలో అనేకులు గాయపడ్డారు. ఓ కార్మికుడికి తుపాకి తూటా తగలగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం విధులు నిర్వర్తించాల్సిన కార్మికులంతా ఫ్యాక్టరీ ఆవరణలో జమకూడి గత రెండు సం॥లుగా సాధారణ పనిగంటలను మించి నాలుగు గంటలు అదనంగా చేస్తున్న పనికి ఓవర్‌టైమ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు పూనుకున్న ఫలితమే ఈ లాఠీఛార్జీ, కాల్పులు! టాటా స్టీలు పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన ఓవర్‌టైమ్ బకాయిలను చెల్లించటానికి సిద్ధం కాలేదు. దీనితో కార్మికులు నిరసనకు దిగారు. అంతమాత్రానే ఆగ్రహించిన భద్రతా దళాలు క్రూరంగా లాఠీఛార్జీ జరిపాయి.

2014 జూన్ 15న, పశ్చిమ బెంగాల్‌రాష్ట్రం, హుగ్లిజిల్లా భద్రేశ్వర్ వద్ద నున్న నార్త్‌బ్రూక్ జూట్‌మిల్ సి.ఇ.ఓ.ను కార్మికులు చుట్టుముట్టి కొట్టటంతో సి.ఇ.ఓ. చనిపోయాడు. పనిగంటల తగ్గింపుతో తమ వేతనాలు తగ్గిపోతాయి గనుక, ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలనే కార్మికుల ప్రతిపాదనను అతను మొండిగా నిరాకరించటంతో, వెనువెంటనే ఆగ్రహానికి గురైన కార్మికులు అతనిని చుట్టుముట్టి, తమ డిమాండ్ పరిష్కారమయ్యే మార్గం కానక నిస్పృహకులోనై ఆతనిపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కారణంతో నార్త్‌బ్రూక్ జూట్‌మిల్లుతో సహా 7 జూట్‌మిల్లులను లాకౌట్ చేసిన యాజమాన్యాలు దాదాపు 30,000 మంది కార్మికులను వీధిన పడేశాయి.

2014 జూలై 1న, చెన్నైలో నిర్మాణంలోనున్న ఓ 11 అంతస్తుల భవనం కుప్పకూలటంతో ఏపి, ఒడిషా తదితర ప్రాంతాల వలస కూలీలతో సహా 61 మంది చనిపోయారు. మరో 27 మంది తీవ్రంగా గాయపడ్డారు.

2014 జూలై 11న, తెలంగాణ రాష్ట్రం – నల్గొండ జిల్లా, హుజూర్‌నగర్ అసెంబ్లీ పరిధిలోని పులిచింతల ప్రాజెక్టులో భాగంగా ఓ మట్టి గోడని నిర్మిస్తుండగా పెద్ద పెద్ద మట్టి పెళ్ళలు విరిగిపడి ఒక సబ్‌కాంట్రాక్టరుతో సహా నలుగురు కార్మికులు మరణించారు. ఇందులో ఒకరు యు.పి., ఒకరు పశ్చిమబెంగాల్, ఒకరు ఎమ్.పి. మరొకరు తెలంగాణకు చెందిన వలస కూలీలుగా వున్నారు.

సార్వత్రిక ఎన్నికలు, 'ప్రజాస్వామ్య' విజేతల సంబరాలలో దేశం మునిగిపోయిన గత నాలుగు నెలల కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు మాత్రమే ఇవి! **నయా ఉదారవాద సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు ఆధిపత్యంలో వుండి పాలన సాగిస్తున్న నేటి అర్ధ వలస, అర్ధభూస్వామ్య భారతదేశంలో అనియత, అసంఘటిత రంగాలలోని కార్మికుల; పారిశ్రామిక, సంఘటిత రంగాలలోని కార్మికుల భయానక, విషాద పరిస్థితులకు ఈ సంఘటనలు అద్దంపడుతున్నాయి.** కనీసపాటి జీవన పరిస్థితులు కల్పించబడతాయనే చిన్నపాటి ఆశను కూడా కోల్పోయి ఈ దేశంలోని కార్మికులు, కష్టజీవులు ఎంతటి నిరాశా, నిస్పృహలకు నెట్టివేయబడుతున్నారో; చుట్టుముట్టబడిన పరిస్థితులలో వారు తప్పనిసరై ఏ విధంగా యాజమాన్యానికి లోబడాల్సి వస్తున్నదో లేక నిస్పృహ చెందిన కారణంగా ఏ విధంగా ఆకస్మిక హింసాత్మక చర్యలకు పూనుకుంటున్నారో లేక న్యాయం జేయటానికి బదులుగా పారిశ్రామిక యాజమాన్యాలతో చేతులు కలిపిన రాజ్య పోలీసు యంత్రాంగం ప్రయోగించే క్రూరహింసను వారు ఏ విధంగా ఎదుర్కొంటున్నారో ఈపై సంఘటనలు కళ్ళకు కడుతున్నాయి.

పాలకులు, పాలకవర్గాలు నయా ఉదారవాద పెట్టుబడిదారీ సమర్థకులైన మేధావులు ప్రస్తుతం పారిశ్రామిక అభివృద్ధి, 'రెండోతరం సంస్కరణల' గురించి మాట్లాడుతున్నారు. వీరంతా, భారీస్థాయి పారిశ్రామిక అభివృద్ధి జరగకుండా మన దేశ కార్మికుల, కష్టజీవుల కఠిన పని పరిస్థితులు మెరుగుకాబోవంటూ, అందుకు "భారతదేశంలో భారీస్థాయి ఉత్పత్తుల కల్పనకు ఆటంకంగావున్న కఠినతరమైన కార్మిక చట్టాలను పునర్నిర్వచించాల్సిన" అవసరాన్ని గురించి తరచుగా పేర్కొంటూ వస్తున్నారు. మనదేశంలో ప్రస్తుతం ఉనికిలో వున్న కార్మికచట్టాలే, కార్మికుల దుర్భరస్థితిగతులకు కారణమన్నట్లుగావారు ప్రక్కదోవ పట్టిస్తున్నారు. ఇదే వాస్తవమయ్యేట్లయితే, ఈ వ్యాస ప్రారంభంలో పేర్కొన్నటువంటి భయానక సంఘటనలు జరిగేందుకే అవకాశం లేదు.

ఇంతేగాక, ఇటీవలి కాలంలో ఆటోరంగ పరిశ్రమలలోను, ఇతర చోట్ల అనుభవాలను పరిశీలిస్తే కూడా, కఠినతరమైన కార్మిక చట్టాలవలనగాక, బడా పెట్టుబడిదారీవర్గపు కార్మిక వ్యతిరేక మొండివైఖరివల్లనే శ్రామిక జనావళి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటోందని స్పష్టమౌతోంది.

2014 మార్చిలో, పెరిగిన వేతనాలు, ఇతర సౌకర్యాలతో తిరిగి నూతన వేతన ఒప్పందాన్ని చేసుకోవాలనే కార్మికుల న్యాయమైన డిమాండును పరిష్కరించకుండా 4,500 మంది కార్మికుల నోళ్ళు మూయించటానికి కర్ణాటకలోని తన పరిశ్రమలను టయోటా – కిర్లోస్కర్ యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. కార్మికులు, హింసాత్మకంగానూ, పరిశ్రమ వ్యతిరేకులుగానూ, అభివృద్ధి నిరోధకులుగానూ ఉన్నట్లుగా మోసపూరితంగా టయోటా–కిర్లోస్కర్ యాజమాన్యం కార్మికులపై ప్రజలలో దుష్ప్రభావాన్ని కలిగించేందుకు కుటిల ప్రచారాన్ని చేపట్టింది. ఈ విధంగా యాజమాన్యం కార్మికులను బెదిరించి, లాకౌట్ ఎత్తివేసిన తర్వాతనైనా వారు విధులలోకి రావాలంటే కూడా వారంతా, 'సత్ప్రవర్తనకు లోబడి వుంటామనే' పత్రాలపై సంతకాలు చేయాల్సివుంటుందని షరతు విధించింది. ఈ ఘటనలో టయోటా యాజమాన్యం యొక్క దుర్మార్గమైన కార్మికవ్యతిరేక ఆచరణను 'కఠినతరమైన కార్మిక చట్టాలు' ఎక్కడా అడ్డుకోలేదు; మరోవైపున కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేందుకూ అవి తోడ్పడలేదు.

2014 మార్చిలో, 'నేపినో' కార్మికులు, యాజమాన్యం యొక్క మూడు యూనిట్లను 10 రోజులపాటు ఒక సమన్వయంతో తమ అధీనంలో వుంచుకునేందుకు పూనుకున్నారు. వారి చట్టబద్ధ డిమాండ్లు కూడా నెరవేరని స్థితిలో, దానిని గుర్తింపజేసేందుకు ఈ చర్య చేపట్టారు. కానీ, 'కఠిన కార్మిక చట్టాలు' వారిని సమ్మెలోకి వెళ్ళనీయకుండాజేసి, వారి సమస్యలను పరిష్కరించలేదు.

2014 మార్చిలో, చెన్నైలోని ఫోర్డు కంపెనీ 2012 నుండి కార్మికులపై పనిభారాన్ని మరింతగా పెంచింది. మరోవైపున 2013 వరకు కార్మికులకు చెల్లిస్తున్న 26 శాతం ప్రోత్సాహకాలను 15 శాతానికి తగ్గించి ఆ మేరకే కార్మికులకు చెల్లించింది. తిరిగి ఇక్కడ కూడా 'కఠినమైన కార్మిక చట్టాలే'వీ కార్మికులకు సహాయంగా రాలేదు. అధికోత్పత్తిని రాబట్టుకుని కూడా ఉత్పత్తి ప్రోత్సాహకాలలో కోతబెట్టిన యాజమాన్యపు దుర్మార్గ చర్యలకు వ్యతిరేకంగా ఆ చట్టాలు ఏ మాత్రం ఉపయోగపడలేదు.

2014 మే లో, చెన్నైలోని నోకియా ఇండియా 8000 మంది కార్మికులను, ఫాక్స్‌కాన్ కంపెనీ 1700 మంది కార్మికులను స్వచ్ఛంద పదవీ విరమణ పథకం క్రింద బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశాయి. కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు ఇక్కడ కూడా 'కఠినతరమైన కార్మిక చట్టాలేవీ' కార్మికులకు అండగా రాలేదు.

2014 మే లో, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హిందుస్థాన్ మోటార్స్ యాజమాన్యం, తమ 'ఉత్తరపాద' యూనిట్‌లో పనిచేస్తున్న 2,600 మంది కార్మికులను నిధుల కొరత తదితర తప్పుడు సాకులు, ప్రకటనలతో సస్పెండ్‌చేసి, వారిని వీధులపాలుజేసింది. గత నాలుగు నెలల కాలంగా వారికి వేతనాలు లేకుండా వేధింపులకు గురిచేస్తోంది. ఇక్కడ కూడా 'కఠినతరమైన కార్మిక చట్టలే'వీ హిందూస్థాన్ మోటర్స్ యాజమాన్యపు కార్మిక వ్యతిరేక చర్యలను అడ్డుకునేందుకు ముందుకు రాలేదు.

**మనదేశంలో నియత మరియు సంఘటిత రంగాలకు చెందిన పారిశ్రామిక కార్మికుల ఇటీవలి అనుభవాలలో ఇవి కొన్ని మాత్రమే!** గత ఆరునెలల కాలంలోనే ఇలాంటి సంఘటనలనేకం ఇంకా పేర్కొనవచ్చు.

కానీ మన పాలకులు, బడాపెట్టుబడి అధినేతలు, మరియు వారి సంస్థలు, వారి తొత్తులైన నిపుణులనబడే వారితో కలసి భారతదేశంలో 'కఠినతరమైన కార్మిక చట్టాలు' ఉత్పత్తి కార్యకలాపాలను నిరోధిస్తున్నాయని, అదే విధంగా భారతదేశ పరిశ్రమలలో ఈ చట్టాలు అనియత, అసంఘటిత, కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికుల సంఖ్య అసాధారణ పెరుగుదలకు మూల కారణంగా వున్నాయని ప్రచారం చేస్తూ గగ్గోలు పెడుతున్నారు. ఏ చట్టాలైనా అమలుజరిగి, అవి కార్మికులకు ఏ మేరకైనా సహాయకారిగా వుంటాయనుకుంటే ఆ చట్టాలన్నింటినీ రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికులకు చక్కటి జీవితాలను కాకున్నా వారి కనీసపాటి జీవనానికి కావలసిన వాతావరణాన్ని, పరిస్థితులను కల్పించటం కోసం ఏ మాత్రపు బాధ్యతాయుతమైన, నిజాయితీ కలిగిన ప్రభుత్వమైనా, పాలకులైనా పూనుకోవలసివుంటుంది. బలహీనంగా వున్న కార్మిక అనుకూల చట్టాలను ధృడపరిచి, వాటిని ఖచ్చితంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టవలసి వుంటుంది.

'గ్లాక్సో లేబొరేటరీస్ వర్సెస్ ప్రిసైడింగ్ ఆఫీసర్' కేసులో సుప్రీంకోర్టు కూడా 'పెట్టుబడిదారుని కోసం తమ రక్తమాంసాలను పణంగా పెట్టే అసమాన భాగస్వామి'ని కాపాడాలని పిలుపునిచ్చింది.

కనుక, ప్రస్తుతం ఉనికిలోవున్న కార్మిక చట్టాల ద్వారా నామమాత్రంగానైనా కార్మికులకు లభించే హక్కులను రద్దు చేయటంకాకుండా, నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్.డి.ఏ. ప్రభుత్వం కార్మిక చట్టాలలో న్యాయబద్ధమైన సంస్కరణలను చేయటం వారి బాధ్యతగా వుంటుంది.

కానీ, ఎన్.డి.ఏ ప్రభుత్వం, గత యు.పి.ఏ పాలకుల అసమర్ధ పాలన గురించి ఆరోపణలు, విమర్శలుజేస్తూ మాటలు కోటలు దాటే తన వాగ్దానాలకు, నినాదాలకు భిన్నంగా, సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థలు నిర్దేశించిన రెండో తరం సంస్కరణల పేరుతో కార్మికవ్యతిరేక, కార్మికవర్గవ్యతిరేకమైన తమ సహజమైన, అసలు రూపంతో ముందుకొస్తున్నది. **కార్మిక చట్టాలలో సంస్కరణలు చేయాల్సిన అవసర ముందంటూ, బ్రిటిష్‌కాలంనాటి పాతబడిన చట్టాలను రద్దుచేయాలంటూ ఎన్.డి.ఏ. పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పరిస్థితులకనుగుణంగా వాటిని సవరించేందుకు పూనుకుంటున్నారు.**

బి.జె.పి నాయకత్వంలోని రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం, కార్మికుల హక్కులను కాలరాచివేస్తూ, పారిశ్రామిక యాజమాన్యాల ప్రయోజనాలు కాపాడేందుకు వీలుగా చట్ట సవరణలకు ముందుదారి చూపింది. రాజస్థాన్ రాష్ట్ర మంత్రిమండలి – పారిశ్రామిక వివాద చట్టం, ఫ్యాక్టరీల చట్టం, కాంట్రాక్టు లేబర్ చట్టం వంటి మూడు కీలకమైన జాతీయ కార్మిక చట్టాల సవరణలకు ఆమోదం తెల్పింది. ఈ చట్ట సవరణలన్నీ యాజమాన్యాలకు అనుకూలమైనవే. ప్రస్తుతం రాజస్థాన్ ప్రభుత్వం చేసిన చట్ట సవరణ ప్రకారం, ప్రభుత్వ అనుమతి పొందకుండానే 300 మంది కార్మికులు లేదా ఉద్యోగులను ఒక్కసారిగా విధుల నుండి తొలగించేందుకు పారిశ్రామిక యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తోంది. ఈ సవరణకు ముందు 100 మందికి మించి తొలగించేందుకు వీలువుండేదికాదు. పారిశ్రామిక వివాదాలను లేవనెత్తే కాలపరిమితిని ఈ సవరణలు 3 సంవత్సరాలుగా చేశాయి. కార్మిక యూనియన్లను రిజిస్టర్ చేసుకోవటం కూడా ఈ చట్టసవరణల తరువాత కఠినతరమౌతుంది. ప్రస్తుతం 20 మంది కార్మికులు పనిచేస్తున్న చోట కాంట్రాక్టు కార్మిక చట్టాన్ని అమలు

**(తరువాయి 2వ పేజీలో)**

# భారతదేశంలో బుల్లెట్ రైళ్ళు - బహుళజాతి, బడాకార్పొరేటు సంస్థల సూపర్ లాభాల సముపార్జన కోసమే!

**కేంద్రంలో** అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ పాలకులు – 'మంచి దినాలు ముందున్నాయంటూ'నే ప్రజలపై భారాలు మోపే చర్యలకు పూనుకుంటున్నారు. పెట్రోలు, డీజిలు ధరలు పెంచారు. కిరోసిన్ ధరలను, నెలకు ఐదు రూ॥ చొప్పున గ్యాస్ సిలెండర్ల ధరను పెంచనున్నారు. ఉల్లి, బంగాళదుంపలతోసహా నిత్యావసర వస్తువుల ధరలన్నీ మండిపోతున్నా మిన్నకున్నారు. పాలు, పంచదార ధరలు పెంచేశారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలతో ప్రజలపై విద్యుత్తుభారాలు కొనసాగిస్తున్నారు. రక్షణ, బీమారంగాలతో సహా అన్ని రంగాలలోకీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. విద్యను కాషాయీకరించే చర్యలు చేపట్టారు. కార్మికుల హక్కులను కాలరాచేవిధంగా చట్టాలను తిరగదోడు తున్నారు. పబ్లిక్ రంగ సంస్థలను తెగనమ్మి, ఆదాయం సమకూర్చుకుంటామంటూ నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు.

రైల్వేబడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కొద్దిరోజులు ముందుగా రైల్వే ప్రయాణీకుల ఛార్జీలను 14.2 శాతం పెంపుచేస్తూ ప్రజలపై పెద్దఎత్తున భారం మోపారు. జులై 25 నుండి అమలైన ఈ పెంపుతో 8 వేల కోట్ల రూ॥ల ఆదాయం సమకూర్చుకోనున్నామని ప్రకటించారు. అలాగే, రైల్వేలలో సరుకు రవాణా ఛార్జీలపై 6.5 శాతం ధరలు పెంచారు. ఈ భారం కూడా పరోక్షంగా వినియోగదారులైన ప్రజలే భరించాల్సి వుంటుందనేది అందరికీ తెలిసిందే.

2012లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఇదే తీరులో రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఛార్జీలు పెంచటాన్ని తప్పుపడుతూ నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి, మన్మోహన్‌సింగ్‌కు ఓ బహిరంగలేఖ రాశాడు. అందులో, పార్లమెంటు అధికారాలను యుపిఏ ప్రభుత్వం దిగజారుస్తోందని తీవ్రంగా దుయ్యబట్టాడు. కానీ, అధికారంలోకి వచ్చీ రాగానే, తిరిగి తామూ అదే రీతిగా వ్యవహరిస్తూ, ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే చేదుమందులు, కఠిన నిర్ణయాలు తప్పవంటూ ప్రజలపై భారాలు మోపడంలో యుపిఏ పాలకులతో పోటీపడుతున్నాడు.

## రైల్వేలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు ఆహ్వానం

కేంద్ర రైల్వేశాఖామంత్రి సదానందగౌడ జులై 7న పార్లమెంటులో రైల్వేబడ్జెట్టును ప్రవేశపెడుతూ 'వ్యాపార సంస్థలాగా లాభాలు గడించటం సంక్షేమ సంస్థలాగా సేవలందించటమనేవి రెండూ – రైలుపట్టాల వంటివని, ఇవి రెండూ సమాంతరంగా సాగుతాయని, ఇవి రెండూ కలవబోవంటూ' వేదాంత ధోరణిలో తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. సారాంశంలో, రైల్వేలను – బడా పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి సంస్థలకు పెద్దఎత్తున లాభాలు సమకూర్చిపెట్టే వ్యవస్థగా మలిచి, ప్రజాధనాన్ని వారికి దోచిపెట్టే పథకాలను రైల్వేబడ్జెట్టులో వండివార్చాడు.

రైల్వేల మౌలికవసతుల కల్పనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచాడు. కీలక ప్రాజెక్టులలో ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పెంచుతామని, వలంటరీ సంస్థలను, సామాజిక సంస్థలను, కార్పొరేటు సంస్థలను భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చాడు. ప్రధానమంత్రి స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లోని అహమ్మదాబాద్ నుండి ముంబై వరకూ బుల్లెట్టు రైలు నడపనున్నట్లు ఆయన తన బడ్జెట్టులో పేర్కొన్నాడు. కలకత్తా, చెన్నై, ముంబైలను న్యూఢిల్లీతో కలుపుతూ 'వజ్ర చతుర్భుజి' రైల్వేలైన్ల అభివృద్ధి; తొమ్మిది రైల్వేజోన్లలో రైళ్ళవేగాన్ని గంటకు 160 కి॥మీ. నుండి 200 కి॥మీ. వరకు పెంచటం వంటి నిర్ణయాలను ఆయన రైల్వేబడ్జెట్‌లో ప్రకటించాడు. ఇంతేకాదు. రైల్వేబడ్జెట్టుకు ముందుగానే ప్రయాణీకులపై రైలు ఛార్జీల పెంపు భారాన్ని మోపిన రైల్వేమంత్రి, ప్రతి ఆరునెలలకొకసారి అంతర్జాతీయ ఇంధన ధరల కనుగుణంగా రైలు ఛార్జీలను సవరించుతామని (పెంచుతామని) చావుకబురు చల్లగా చెప్పాడు. ఇంధన ఛార్జీల సర్దుబాటు పేరిట విద్యుత్తు ఛార్జీల భారంతో ప్రజలు ఎంతగా విలవిల్లాడుతున్నారో గమనించినపుడు, అదేవిధానం రైలుఛార్జీలకు కూడా వర్తింపచేస్తే సామాన్యుడికి రైలు ప్రయాణం మరింత భారమౌతుంది. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలకులు కూడా ఆర్టీసీలో ఇదే సూత్రాన్ని (ఇంధన ఛార్జీల కనుగుణంగా బస్సు ఛార్జీలు పెంచటం) అమలుచేసి, ప్రయాణీకులపై ఛార్జీల భారాన్ని మోపటానికి పథకాలను సిద్ధం చేస్తున్నారు.

## ప్రజోపయోగ పథకాల అమలులో నిర్లక్ష్యం

చెన్నై, ముంబై, కోల్‌కతాలను న్యూఢిల్లీతో అనుసంధానంచేసే ఆరువేల కిలోమీటర్ల వజ్ర చతుర్భుజి రైల్వే లైను అభివృద్ధికి 9 లక్షల కోట్ల రూ॥పైగా ఖర్చు అవుతుందని; అహమ్మదాబాద్ – ముంబై బుల్లెట్ రైల్వేలైను నిర్మాణానికి 60,000 కోట్ల రూ॥ వ్యయమౌతుందని అంచనా వేశారు.

కేంద్ర రైల్వే వార్షిక ప్రణాళికలో ప్రకటించిన 1,64,374 కోట్ల రూ॥ల ఆదాయ అంచనాలో కేంద్ర ప్రభుత్వ సహాయం 30,233 కోట్ల రూ॥గా వుంది. జనరల్ బడ్జెట్ నుండి ఆర్థిక సహాయమందిస్తే తప్ప స్వయంపోషకంగా నడవలేని వ్యవస్థగా రైల్వేలను దిగజార్చిన పాలకులు, కిలోమీటరుకు 120 కోట్ల రూ॥ వెచ్చించే బుల్లెట్‌రైలు పథకానికి సిద్ధమౌతున్నారు!

సామాన్య ప్రయాణీకుల భద్రత, కనీసపాటి సౌకర్యాలు, దేశవ్యాపితంగా రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ, కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌ల తొలగింపు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం 40 వేల కోట్ల రూ॥ అవసరమౌతాయంటూనే ఈ బడ్జెటులో కేవలం 1,785 కోట్ల రూ॥ మాత్రమే కేటాయించారు!

గత 30 ఏళ్ళలో 1,57,883 కోట్ల వ్యయంతో 676 కొత్త పథకాలను అనుమతి మంజూరుకాగా, అందులో 317 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పూర్తవటానికి పెరిగిన ధరలతో ఇంకా 1,82,000 కోట్ల రూ॥ అవసరమని చెపుతున్నారు. అలాగే గత 10 సం॥ల కాలంలో కొత్తగా 99 రైల్వే లైన్ల నిర్మాణానికి అనుమతులివ్వగా అందులో ఇప్పటివరకూ ఒక్కటి మాత్రమే పూర్తయ్యిందంటే, ప్రజోపయోగమైన పథకాల అమలులో పాలకుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో వుందో అర్థమౌతుంది!

కనుక, భారతదేశంలో సామాన్య ప్రజానీకానికి అవసరమైన కనీస ప్రయాణ అవసరాల గురించి పట్టించుకొనని పాలకులు, ఉన్నత, సంపన్నవర్గాల అవసరాలకోసం వేగంగా, అతివేగంగా నడిచే (పరుగులెత్తే) బుల్లెట్‌రైళ్ళ ప్రవేశానికి తహతహ లాడుతున్నారు. వైఫై లాంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించే అతికొద్దిమంది వ్యాపార, ఉన్నతవర్గాల ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తెస్తూ, 80 శాతంగా వున్న సాధారణ ప్రయాణీకుల కనీస అవసరాలను గాలికొదిలేస్తున్నారు.

## బుల్లెట్టురైలు – నిర్మాణ, నిర్వహణ ఆచరణ యోగ్యమేనా?

ప్రధాని నరేంద్రమోడీ 'కలల ప్రతిరూపమైన' బుల్లెట్టురైలు పథకానికే ఈసారి రైల్వేబడ్జెట్టులో అధిక ప్రాధాన్యతనిచ్చారు. దీనితో బులెట్ రైలు వలన ప్రయోజనాలు, మనదేశ పరిస్థితులలో దాని నిర్వహణ, సాధ్యాసాధ్యాల అంశంపై దేశవ్యాపితంగా చర్చ జరుగుతోంది.

1980లలోనే మాధవరావు సింధియా రైల్వేశాఖా మంత్రిగా వున్న కాలంలో కాన్పూరు నుండి ఆగ్రా మీదుగా ఢిల్లీకి ఓ హైస్పీడ్ రైలును (హెచ్‌ఎస్‌ఆర్ – వేగంగా ప్రయాణించే రైలు) ప్రతిపాదించారు. అయితే దీని నిర్మాణానికి ఖర్చు అధికంగా అవుతుందని, ప్రయాణ ఛార్జీలు అధికంగా నిర్ణయించాల్సి వస్తుందని, ఫలితంగా అత్యధిక ప్రయాణీకులకు ఈ రైలు ప్రయాణం అందుబాటులో వుండదని, అంతిమంగా నష్టాలు మూటగట్టుకోవలసి వస్తుందని నిర్ధారణకొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నారు. గంటకు 130 కి.మీ.ల వేగంతో ప్రయాణించే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ళతో సరిపెట్టారు.

బుల్లెట్ రైళ్ళు లేదా హెచ్‌ఎస్‌ఆర్‌లు నడపాలంటే ప్రత్యేకించి అందుకొరకే నాణ్యమైన, ధృడమైన రైల్వేట్రాక్ నిర్మించాలి. అప్పుడు మాత్రమే ఆ రైళ్ళు 250 కి.మీ నుండి 300 కి.మీ వేగంతో ప్రయాణించ గలుగుతాయి. ఇప్పటికే దేశంలో ఉనికిలో వున్న రైల్వేట్రాకుల స్థాయి పెంచి, అభివృద్ధి చేసి వాటిపై 160 నుండి 200 కి.మీ. వేగంతో హెచ్‌ఎస్‌ఆర్‌లను నడపవచ్చునని ప్రతిపాదిస్తున్నారు. ఇంతటి వేగంతో రైలు సాగిపోవటానికి ముఖ్యంగా నాణ్యమైన, పూర్తి రక్షణతోకూడిన, ఉన్నత ప్రమాణాలతో నిర్మితమైన, ఆటంకాలులేని, అధిక వంపులులేని, సూటైన రైల్వే ట్రాకు తప్పనిసరి అవసరమనే దాంట్లో సందేహం లేదు. అయితే, మొత్తంగా భారత రైల్వే వ్యవస్థ నేడున్న దయనీయ స్థితిలో వీటి అవసరం ఏమిటి, ఎంతవరకు అన్నదే ప్రశ్న.

ఆనాడు బ్రిటీష్ వలసపాలకులు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో తమ పాలనకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ఉద్యమాలను, తిరుగుబాట్లను అణచి వేసేందుకు తమ సైన్యాన్ని, ఆయుధాలను తరలించేందుకు అవసరమైనమేరకు రవాణా వ్యవస్థను – రైలు, రోడ్డుమార్గాలను – నిర్మించారు. తదనంతర కాలంలో పరిపాలనా అవసరాలతోపాటు, గనులు తొలిచే యంత్రసామాగ్రిని, చౌక కార్మికులను భారీగా తరలించేందుకు, సహజవనరులను, భూగర్భ ఖనిజ సంపదలను దోచుకెళ్లేందుకు రైలుమార్గాలను విస్తృత పరిచారు. నౌకా కేంద్రాలతో అనుసంధానం చేశారు.

వలసపాలకుల నుండి అధికార మార్పిడి జరిగే నాటికి భారతదేశంలో 54 వేల కి.మీ.ల నిడివిగల రైల్వే వ్యవస్థ వుంది. ఇది, ఆరున్నర దశాబ్దాలపైగా 'స్వతంత్ర' భారత పాలకుల పాలనాకాలంలో 65 వేల కిలోమీటర్లకు విస్తరించింది. అంటే సగటున ప్రతి సం॥ 165 కి.మీ. నిడివి గల కొత్త రైలు మార్గ నిర్మాణం మాత్రమే జరిగిందని స్పష్టమౌతోంది. అంతేగాక, కొత్తగా రైల్వేలైన్ల నిర్మాణం ఆచరణయోగ్యం (లాభసాటి) కాదని పాలకులు స్పష్టంగా పేర్కొంటూ వస్తున్నారు.

ప్రపంచంలో అతిపొడవైన రైల్వే వ్యవస్థలలో భారతదేశం నాల్గవ స్థానంలో వున్నప్పటికీ, ప్రజా రవాణాలో మాత్రం చాలా నాసిగావుందని అనేక కమీషన్ల నివేదికలు, అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. భారత రైల్వేలలో సంభవిస్తున్న అంతులేని 'ప్రమాదాలు', నాసిరకం – పట్టాలు, బోగీలు, ఇంజన్లు; నిర్వహణా లోపాలను సవరించుకొని, నిర్వహణను మెరుగు జేసుకునేందుకు వివిధ కమిటీలు చేసిన అనేక సూచనలను పాలకులు పెడచెవిన పెట్టారు.

## 500 కి.మీ.ప్రయాణం–4వేల రూ॥ఛార్జీ?!

2012లో నేషనల్ ట్రాన్స్‌పోర్టు డెవలప్‌మెంట్ పాలసీ కమిటి (ఎన్‌టిడిపిసి), అహమ్మదాబాద్ – ముంబయి – పూనేల నడుమ హెచ్‌ఎస్‌ఆర్ జంటలైన్ల నిర్మాణానికి కిలోమీటరుకు 80 కోట్ల రూ॥ వ్యయ మౌతుందని, నిర్వహణావ్యయం, బోగీలు, ఇంజన్లు వంటివాటి ఖర్చు కలపకుండానే మొత్తంగా 63 వేల కోట్ల రూ॥ వ్యయమవుతుందని అంచనావేసింది.

భారతదేశంలో బ్రాడ్‌గేజి (రెండు పట్టాల మధ్య దూరం 1677 మి.మీ.)ఇతర దేశాలలో హెచ్‌ఎస్‌ఆర్‌లు ప్రయాణించే రైల్వేట్రాక్ గేజి (రెండు పట్టాల మధ్య దూరం 1435 మి.మీ) వేరువేరుగా వున్న కారణంగా, హెచ్‌ఎస్‌ఆర్‌ల సాంకేతికపరిజ్ఞానంతోపాటు రైల్వేట్రాక్‌ల నిర్మాణం, ఇంజన్లు, బోగీలు, వ్యాగన్లు వంటి సమస్త అవసరాలకీ ఇతదేశాలపై ఆధారపడవలసిందే! ఆయా బహుళజాతి సంస్థలు నిర్దేశించిన ధరలకు వాటిని దిగుమతి చేసుకోవలసిందే!

బుల్లెట్‌రైలు లేదా హెచ్‌ఎస్‌ఆర్‌లు నడవటానికి పటిష్టమైన ట్రాకు నిర్మాణం, సమర్థవంతమైన నిర్వహణ ప్రారంభ స్థానం నుండి గమ్యస్థానం వరకూ ఏర్పరచుకోవలసిందే. ఇక, సమర్థ నిర్వహణ గురించి చెప్పుకోవాలంటే, ఇటీవల తూర్పుగోదావరిజిల్లా – నగరంలో జరిగిన గ్యాస్ పైపులైను ప్రేలుడు ఘటన మన పాలకుల ఉన్నతాధికారుల 'సమర్థ నిర్వహణకు' ఓ తార్కాణంగా నిలిచేదే కదా?!

హెచ్‌ఎస్‌ఆర్‌ల సాంకేతిక పరిజ్ఞానంతోసహా, విడి భాగాలు, నిపుణుల సలహాల కోసం సైతం సామ్రాజ్యవాద దేశాల, బహుళజాతి కంపెనీలపై ఆధారపడటంతో హెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణ, నిర్వహణ వ్యయం తడిసిమోపెడవుతుంది. దీనితోపాటు వీటి నిర్మాణంలో 'సహజంగా' జరిగే జాప్యంతో వ్యయ అంచనాలు రెట్టింపు అవుతాయి. వెరసి హెచ్‌ఎస్‌ఆర్ ప్రయాణ ఛార్జీలను తక్కువలో తక్కువ కి.మీ.కు 8 రూ॥చొప్పున 500 కి.మీ. ప్రయాణానికి 4000 రూ॥గా నిర్ణయిస్తారు. అంటే దాదాపు విమాన ఛార్జీతో సమానమవుతుంది. ఇంతటి అధికధర చెల్లించి రైలులో ప్రయాణించే బదులు, ఇంతకంటే తక్కువ ప్రయాణ సమయంలో, సుఖవంతమైన విమాన ప్రయాణానికే ఆ స్థాయి ప్రయాణీకులు మొగ్గు చూపుతారు. లేదా ప్రభుత్వమే వందల కోట్ల సబ్సిడీ ఇచ్చి, ప్రజాధనాన్ని బుల్లెట్‌రైలు నిర్వహణా కంపెనీకి దోచిపెట్టడం జరుగుతుంది.

భారతదేశంలో 80 శాతం రైలు ప్రయాణీకులు ఉన్నతశ్రేణిలో ప్రయాణం చేయగలిగిన స్థితిలోనే లేరు. కనుక అత్యధిక ప్రయాణఛార్జీలు చెల్లించవలసిన హెచ్‌ఎస్‌ఆర్‌లలో వీరు ప్రయాణం చేయలేరనేది కూడా స్పష్టమే. మరోమాటల్లో చెప్పుకోవాలంటే ఇంతటి భారీ ఛార్జీలు కలిగివున్న హెచ్‌ఎస్‌ఆర్‌లలో ప్రయాణం 80 శాతంగా వున్న సాధారణ ప్రయాణీకులకు ఉద్దేశించింది కాదని స్పష్టమౌతోంది.

బాగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో గూడా హెచ్‌ఎస్‌ఆర్‌ల వినియోగంపై తీవ్రమైన చర్చ సాగుతోంది. హెచ్‌ఎస్‌ఆర్‌లకు ఉపయోగించే ఇంధనం యొక్క ఖర్చు కూడా భారీగా వుంటుంది. రైలు వేగాన్ని రెట్టింపు చేసేట్లయితే ఇంధన వినియోగం నాలుగు రెట్లవుతుంది. ప్రతి చమురు చుక్కనూ ఆదా చేయాలని, ఇంధన పొదుపు పాటించాలనే పాలకులు ఇంతటి అధిక ఇంధన దుర్వినియోగానికి ఏమని సమాధానం చెపుతారు?

## దుర్భరం కానున్న కార్మికుల పరిస్థితులు

మరోవైపున, ఇప్పటికే రైల్వే వ్యవస్థలో టిక్కెట్ల అమ్మకం, ప్లాట్‌ఫారాల నిర్వహణ, క్యాంటీన్ల నిర్వహణ వంటి అనేక విభాగాలను ప్రైవేటుపరం చేయటం ద్వారా ఎంతోమంది కార్మికుల, ఉద్యోగుల ఉపాధి అవకాశాలను పాలకులు హరించివేశారు. పర్మినెంటు కార్మికుల స్థానంలో ఔట్‌సోర్సింగ్ పేరున కారుచౌక శ్రమశక్తిని కొల్లగొడుతూ కార్మికుల సంఘటితశక్తిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారు.

ఇప్పుడు పాలకులు ముందుకు తెస్తున్న – రైల్వేలలో ఎఫ్‌డిఐల చొరబాటు, ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో కార్పొరేట్ల ప్రవేశం వంటి విధానపరమైన చర్యల ద్వారా రైల్వే ఉద్యోగుల, కార్మికుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారనుంది.

బుల్లెట్‌రైళ్ళ, హెచ్‌ఎస్‌ఆర్ రైల్వేట్రాక్‌ల నిర్మాణ, నిర్వహణకు; మెట్రో రైల్వేస్టేషన్ల అభివృద్ధి, ఆధునీకరణకు; వజ్రచతుర్భుజి నిర్మాణ, నిర్వహణల కొరకు విదేశీ బడాకంపెనీలు కాచుకొని వున్నాయి. దేశంలోని బడా కార్పొరేటు సంస్థలు తమ వాటాకోసం తహతహలాడుతున్నాయి. రైల్వేలలోకి ఎఫ్‌డిఐలను, పిపిపిలను ఆహ్వానించటంలో ఈ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు వివిధ బహుళజాతి కంపెనీలు లాబీయింగ్‌కు వరుస కడుతున్నాయి. (ప్రధాని మోడీ జపాను పర్యటన, చైనా అధ్యక్షుని భారత్ పర్యటనలలో ఈ ఒప్పందాలు ఒక రూపం తీసుకోనున్నాయని భావిస్తున్నారు)

## రైల్వేల ఆస్థులు ప్రైవేటుపరం

1990లలో వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం 'స్వర్ణచతుర్భుజి' పేరిట జాతీయ రహదార్ల విస్తరణకు ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానించి, చేపట్టిన పథకం యొక్క దుష్ఫలితాలు నేడు మనకు స్పష్టంగా కన్పడుతున్నాయి. రోడ్డుపై కాలుపెట్టిన ప్రతి ఒక్కరి ముక్కుపిండి మరీ అనంతంగా సాగే టోల్‌గేట్ల వసూళ్ళు–ధగ్గులు, పిండారీల దోపిడీని తలపిస్తూ వుంది. కనుక, వజ్ర చతుర్భుజి పేరుతో రైల్వేలైన్ల విస్తరణ పేరిట జరిగేది కూడా ఇందుకు భిన్నంగా వుండబోదు. అలాగే విమానాశ్రయాల అభివృద్ధి పేరిట పిపిపిలను ఆహ్వానించి ప్రభుత్వం సేకరించిన భూములన్నింటినీ సంబంధిత గుత్త, కార్పొరేటు కంపెనీలకు కట్టబెట్టిన తరహాలోనే రైల్వేల ఆస్తులన్నీ క్రమంగా కార్పొరేటు కంపెనీల వశమవటమే జరగబోతోంది!

భారతదేశంలో హెచ్‌ఎస్‌ఆర్‌లు నడపాలంటే నూతనంగా మౌలిక సదుపాయాలు, స్టేషన్లు, ట్రాక్‌లు, రక్షణవ్యవస్థ, సిగ్నలింగ్, ఇంజన్లు, బోగీల నిర్మాణం చేసుకోవలసి వుంటుంది. ఇప్పుడున్న రైల్వేట్రాక్‌లు హెచ్‌ఎస్‌ఆర్‌లు ప్రయాణించటానికి తగినవిధంగా లేవనేది స్పష్టమే. అంతేగాక, జనసమ్మర్దం అధికంగా వున్న మెట్రోనగరాల మీదుగా నడిచే ఈ హెచ్‌ఎస్‌ఆర్‌ల కోసం అవసరమైన భూముల సేకరణ అంతా ప్రభుత్వం చేపట్టి, ఆ భూములను అభివృద్ధి చేసేపేరిట కార్పొరేటు సంస్థల పరం చేస్తుంది. ఈవిధంగా ప్రభుత్వమే బడాకార్పొరేట్ల లాభాల సముపార్జనకు 'ఇతోధికంగా' తోడ్పడుతూ తన దళారీ 'కర్తవ్యాన్ని' నిర్వర్తిస్తోంది!

అందువలనే బడాబూర్జువావర్గం మరియు విదేశీ కార్పొరేటుసంస్థలు తమకు తక్షణం అధికలాభాలు సమ కూరుతాయని గ్యారంటీవున్న రైల్వేల మౌలిక సదు పాయాల కల్పనలో పెట్టుబడులకు సిద్ధమౌ తున్నాయి. వజ్ర చతుర్భుజిలో సరుకు రవాణా, కారిడార్ల

# ఐసిడిఎస్‌లు ప్రైవేట్ పరం

**సామ్రాజ్యవాదుల,** విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడిదారుల దోపిడీ ప్రయోజనాల కోసం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్న పాలకులు చివరికి సంక్షేమ పథకాలను కూడా ప్రైవేటుపరం చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే, సమగ్ర బాలల అభివృద్ధి (ఐసిడిఎస్) పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్నింటిని అప్పగించారు.

'స్వాతంత్ర్యం' వచ్చి 67 సం॥లు పూర్తి అయినా ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్యను పాలకప్రభుత్వాలు పరిష్కరించలేకపోయాయి. వర్గ వ్యత్యాసాలు తీవ్రమైనాయి. బడాపెట్టుబడిదారులు లక్షల కోట్లకు పడగలెత్తగా, పేదరికం మరింతగా పెరిగింది. గ్రామీణ పేదల పరిస్థితి మరింత దారుణంగా మారింది. భూమి కొద్దిమంది భూస్వాముల వద్ద అత్యధికంగా ఉండటంతో, భూమిలేని గ్రామీణ పేదలకు రెక్కల కష్టమే జీవనాధారంగా ఉండటంతో, దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకోలేక దుర్భర పరిస్థితులకు నెట్టబడుతున్నారు. ఉత్పత్తి సాధనాలపై హక్కులేని కార్మికుల, పట్టణ పేదల పరిస్థితి అలాగే ఉంది. గ్రామీణ పేదకుటుంబాల్లో గర్భిణి స్త్రీలకు, పిల్లలకు కూడా పోషకాహారం అందక అనారోగ్యంపాలై ప్రాణాలు కోల్పోతున్నారు.

దేశంలో 50 శాతం మంది పిల్లలు, మహిళలు పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని, మాతా శిశు రక్షణలో భారతదేశం వెనుకబడి ఉందని 2011లో ఐక్యరాజ్యసమితి పేర్కొంది. 2005-06 నుండి 2010-11 సం॥ల్లో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో 50 శాతం మంది పిల్లలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని, 5 సం॥లోపు పిల్లల్లో 46 శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారని, 3 సం॥లలోపు పిల్లల్లో 38.4 శాతం మంది పెరగాల్సిన బరువులో పెరగలేదని, 6 నుండి 35 నెలలలోపు పిల్లల్లో 74 నుండి 79 శాతానికి పెరిగిందని, గర్భిణీ స్త్రీలు, బాలింతల్లో రక్తహీనత 50 నుండి 58 శాతానికి పెరిగిందని పేర్కొంది. ఇలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో గ్రామీణ మహిళలు, పిల్లలు ఉన్నారు.

పేదల ఈ దుస్థితికి కారణాలుగా పాలకులు కొన్ని 'సంక్షేమ' పథకాలను ప్రవేశపెట్టి, వారిని తమ చుట్టూ పాలకులు త్రిప్పుకొంటున్నారు. అందులో ఒకటి సమగ్ర బాలల అభివృద్ధి సర్వే (ఐసిడిఎస్) పథకం. దేశంలో మాతా శిశు మరణాలను, పోషకాహారలోపాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ పథకాన్ని 1975 అక్టోబర్ 2న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇది ఒక పథకంగా కాకుండా, రెగ్యులర్ శాఖగా మార్చాలని 2001లో సుప్రీమ్‌కోర్టు తీర్పు యిచ్చింది. కాగ్ నివేదిక, ఇతర అధ్యయన సంస్థలు కూడా ఇలాంటి సిఫార్సులే చేశాయి. అయినా పథకం ప్రారంభమై 37 సం॥ గడుస్తున్నా రెగ్యులర్ శాఖగా కేంద్ర ప్రభుత్వం మార్చలేదు.

కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దేశంలో 33 ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. "ఐసిడిఎస్ గ్రామీణ పేదలకు ఉపయోగపడుతుందని, అన్ని నివాస ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేయాలనీ కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీమ్‌కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఆ ఆదేశాల తర్వాతనే ఇప్పుడు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 50 శాతం ఏర్పాటు అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో 385 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 85 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 1,55,000 మంది పనిచేస్తున్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల వెట్టిచాకిరి

వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా అనేక చట్టాలు చేయబడ్డాయి. కనీస వేతన చట్టంకన్నా తక్కువ వేతనం పొందేవారందరూ వెట్టిచాకిరీ క్రిందకే వస్తారని చట్టంలో పేర్కొన్నారు. చట్టాన్ని అమలుపర్చనివారిపై కేసులు బనాయించాలని పేర్కొన్నారు. చట్టాన్ని అమలు పర్చాల్సిన భారత పాలకులు అందుకు విరుద్ధంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఎడల వ్యవహరిస్తున్నారు. కనీస వేతనాన్ని అమలుజరపకుండా గౌరవవేతనం పేరుతో అతితక్కువ చెల్లిస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉదయం నుండి పిల్లల సంరక్షణ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణ చూస్తున్నారు. ఇంతేకాకుండా జనాభా లెక్కలు, రేషన్ కార్డుల వెరిఫికేషన్, ఓటర్ల నమోదు, ప్రకృతివైపరీత్యాల లెక్కలు ప్రభుత్వం కేటాయించే అనేక పనులు రాత్రనకా - పగలనకా బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ఇలా అధిక శ్రమ చేస్తున్న కార్యకర్తలకు ప్రారంభంలో 125 రూ. గౌరవవేతనంగా యిచ్చారు. రోజుల్లా పనిచేస్తూ సరైన వేతనం లభించకపోవటం వలన వారి కుటుంబాలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొనటంతో జీతాల పెంపుదలకు, ఉద్యోగ భద్రతకు అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా కొద్దికొద్దిగా వేతనం పెంచుతూ కార్యకర్తలకు 2,200, ఆయాలకు 1200రూ. ఇచ్చారు. తిరిగి అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేసిన ఫలితంగా 2011 ఏప్రియల్‌లో వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం జి.ఓ. జారీ చేసింది. జి.ఓ. ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తలకు 1500 రూ., ఆయాలకు 700 రూ. వేతనం పెరిగింది. పెరిగిన దాని ప్రకారం 3700, 1900 రూ. వేతనం ఉంది. ఇది కూడా కనీస వేతనానికి తక్కువే. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొంటే వారికి చెల్లించే వేతనం కుటుంబ కనీస అవసరాలకు కూడా సరిపోదు. కనీసవేతన చట్టాన్ని అమలుజరపాలని దేశంలోనూ రాష్ట్రంలోనూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనను నిర్బంధంతో అణచివేయ ప్రయత్నిస్తూ పాలకులు మొండిగా తిరస్కరిస్తున్నారు.

## పిల్లలకు-గర్భిణీలకు-బాలింత స్త్రీలకు అందని పోషకాహారం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న పిల్లలకు, గర్భిణీలకు - బాలింత స్త్రీలకు పోషకాహారాన్ని అందించటమే ధ్యేయంగా పాలకులు ప్రకటించారు. ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదు. మూడేళ్లలోపు పిల్లలకు 90 గ్రాములు, ఆపైన వారికి 110 గ్రాముల ఆహారాన్ని అందించవలసి ఉంది. ఆమేరకు పిల్లలకు ఆహారం అందటంలేదు. అందే ఆహారం కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో తయారు కావటంలేదు. 223 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెడీ టూ ఈట్ ఫుడ్ పేరున ఏ.పి. ఫుడ్ సంస్థ ఉప్మా కిచిడి, హల్వా వడియాలు అందచేస్తున్నది. మిగతా కేంద్రాల్లో లోకల్ ఫుడ్ (స్థానిక ఆహారం) పేరుతో కిచిడి, పొంగలి, పెసరపప్పు, మినపప్పు, శనగలు తదితర ఆహారాన్ని యివ్వవలసి ఉంది. ఏ.పి. ఫుడ్ సంస్థ అందిస్తున్న ఆహారం, ఎప్పుడో తయారుచేసిన, నాణ్యతలేనిదిగా ఉండటం వలన పిల్లలు ఆహారాన్ని ముట్టటంలేదు. పిల్లలు ఇష్టపడేది పప్పుతో కూడిన అన్నం, పెరుగు లేక చిక్కటి మజ్జిగ, ఇడ్లీ, గుగ్గిళ్ళు లాంటి ఆహారమన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా లోకల్ ఫుడ్‌లో వీటిని పెట్టటంలేదు. ఇందుకు కాంట్రాక్టర్ల లాభాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది.

గర్భిణీ, బాలింతలకు పోషకాహారం అందటం లేదు. వీరి కోసం ఇందిరమ్మ అమృతహస్తం పథకాన్ని యు.పి.ఏ ప్రభుత్వం తీసుకొచ్చి 102 ప్రాజెక్టుల్లో 2013 జనవరి 1 నుండి ప్రారంభించింది. మరో 119 ప్రాజెక్టులకు విస్తరింపచేస్తామని చెప్పింది. ఎన్.డి.ఏ ప్రభుత్వం ఈ పథకం గురించి మాట్లాడటం మానివేసింది. వీటికి పాలు, గుడ్లు, ఆకుకూరలు అందించే బాధ్యతను గ్రామ సమాఖ్యలకు ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం కేటాయించిన డబ్బులు గ్రామపంచాయితీ ఖాతాలోకి వస్తాయి. గ్రామ సమాఖ్యలు మాత్రం సరుకులు ఇవ్వటంలేదు. అంగన్‌వాడీ వర్కర్లపై వత్తిడిచేసి బలవంతంగా వారిచేత ఖర్చుపెట్టిస్తున్నారు. ఇది వారికి భారంగా మారింది. తిరిగి ఆ డబ్బులు పొందటానికి పంచాయితీల చుట్టూ వారు తిరగాల్సి వస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు అందక, గ్రామ సమాఖ్యలు సరుకులు అందించకపోవటం వలన గర్భిణీ - బాలింతలకు పోషకాహారం అందటంలేదు.

## ఐసిడిఎస్‌లను నీరుగారుస్తున్న పాలకులు

పేదల సంక్షేమం, అభివృద్ధి ఎడల చిత్తశుద్ధిలేని పాలకులు, అనేక పథకాలను నీరుగార్చినట్లుగానే "ఐసిడిఎస్"ను నిర్వీర్యం చేస్తున్నారు. అందుకోసం బడ్జెట్ నిధులను తగినంతగా కేటాయించకపోగా, కేటాయించిన నిధులను కూడా ఖర్చుచేయటం లేదు. 11వ పంచవర్ష ప్రణాళికలో 72,877.52 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది 37,891 కోట్లు మాత్రమే. 12వ పంచవర్ష ప్రణాళికలో 2,58,000 కోట్లు పథకానికి అవసరం కాగా, బడ్జెట్‌లో ఆమోదించింది 1,77,456 కోట్లు మాత్రమే. 2013-14 సం॥ బడ్జెట్‌లో కేటాయించింది కేవలం 17,700 కోట్లు. ఈ కేటాయింపులు గమనిస్తే "ఐసిడిఎస్" పథకాన్ని పాలకులు ఏవిధంగా నీరుగార్చేదీ అర్థమౌతుంది.

2006-07 నుండి 2010-11 సంవత్సరాల్లో 13 రాష్ట్రాలు, 67 జిల్లాలు, 2730 అంగన్‌వాడీ కేంద్రాలను కాగ్ సర్వే చేసింది. ఈ సర్వేలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కా భవనాలు లేవని, వంట సామాగ్రి నిల్వచేసుకోవటానికి కూడా స్థలం లేదని, మరుగుదొడ్లు, త్రాగునీరు, ప్రీస్కూల్ కిట్స్ అందుబాటులో లేవని వెల్లడించింది. ఇందుకు అరకొర బడ్జెట్ నిధులే కారణమని పేర్కొంది. ప్రీస్కూల్స్‌కి అందచేసే కిట్లు, మెడికల్ కిట్లు, రిజిస్టర్ల సరఫరాలో 500 కోట్ల అవినీతిలో అధికారులు కీలకపాత్ర పోషించారు.

## ప్రైవేట్ సంస్థలపరమౌతున్న ఐసిడిఎస్‌లు

తల్లి - పిల్లల మరణాలు తగ్గించేందుకు, పేద కుటుంబాల పిల్లల, స్త్రీలకు పోషకాహారాన్ని అందించేందుకు "ఐసిడిఎస్" ఏర్పాటు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే పాలకులు, వాటి బాధ్యతను వదిలించుకునే చర్యలు చేపట్టారు. గత పది సంవత్సరాలు ప్రభుత్వాలు ఆ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మనరాష్ట్రంలో మదర్స్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, పంచాయితీలకు వాటిని అప్పగించాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అంగన్‌వాడీ ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించి నిలవరించారు. అయినా ప్రభుత్వం అలాంటి విధానాలు విడనాడక మరింత వేగవంతం చేసింది. ఆహార పంపిణీ బాధ్యతను హైదరాబాద్‌లో నాంది ఫౌండేషన్‌కు, విశాఖపట్నం, రంగారెడ్డి జిల్లాల్లోని శేరిలింగం ప్రాజక్టును అక్షయపాత్రకు అప్పగించింది. ఇవేకాకుండా బికెపి ఆధ్వర్యంలో బాలబడులను పెట్టేందుకు సిడిఆర్ సచ్ఛందసంస్థకు అనుమతించింది. ఇంకొక అడుగు ముందుకేసి తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లాల్లో 78 అంగన్‌వాడీ కేంద్రాల్లో అసిస్టెంట్ వర్కర్లను పెట్టటం ద్వారా ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఐ.టి.సిలకు ఐసిడిఎస్‌లలోకి చొచ్చుకుపోయి వాటిని స్వాధీనం చేసుకొనేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అందుకు అనుకూలమేగాక ఇంకా వేగవంతం చేసే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వం కూడా ఐసిడిఎస్‌లను ప్రైవేటీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికోసం ఐసిడిఎస్‌ను మిషన్‌కోడ్‌లోకి తెచ్చి స్వచ్ఛంద సంస్థలకు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఐటిసి సంస్థలకు అనుమతిస్తూ 2013 అక్టోబర్ 25న ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రైవేటీకరణలో పరుగులుతీస్తూ దీన్ని మరింత వేగవంతం చేయనున్నది.

## మౌలిక సమస్యల పరిష్కారానికై పేదలు ఉద్యమించాలి

ప్రజల మౌలిక సమస్య అయిన భూమి సమస్య పరిష్కారంకాకుండా ప్రభుత్వాలు తెచ్చే సంక్షేమ పథకాలు ప్రజల పేదరికాన్ని తొలగించలేవు. అందులో భాగమే "ఐసిడిఎస్" పథకం. ఇలాంటి పథకాల ద్వారా పేదల్లో భ్రమలు కల్పిస్తూ, తమచుట్టూ తిప్పుకొంటూ, వారి మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాట మార్గం చేపట్టకుండా చేయటమే పాలకుల విధానం. పాలకులవిధానాలను అర్థం చేసుకొని తమ జీవితాలతో ముడిపడిఉన్న భూమిని సాధించేందుకు, భూ కేంద్రీకరణను బద్దలుకొట్టేందుకు ఐక్యంగా గ్రామీణ పేదలు ఉద్యమించాలి. అప్పుడు మాత్రమే పేదరికం నుండి బయటపడి, స్వతంత్రంగా బ్రతకగలుగుతారు. ✡

---

0 అభివృద్ధేగాక వాటి నిర్వహణనుకూడా తమకు అప్పగించవలసిందిగా అవి ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

జపాన్ దేశానికి చెందిన జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజన్సీ (జెఐసిఎ) హెచ్ఎస్ఆర్‌ల నిర్మాణ, నిర్వహణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తోంది. తద్వారా తమ దేశ సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్రాలను, నిపుణులను మనదేశానికి దిగుమతి చేసి - వీటన్నింటి ద్వారా అత్యధిక లాభాలను కొల్లగొట్టు కెళ్ళాలని భావిస్తోంది. చైనా, ఫ్రాన్స్ దేశాల సంస్థలు కూడా ఈ పోటీలో వున్నాయి.

చైనా, జపాన్, ఫ్రాన్స్‌లతోసహా వివిధ ప్రపంచ దేశాలలో నడుస్తున్న హెచ్ఎస్ఆర్‌లన్నీ ఆయా ప్రభుత్వాల భారీ సబ్సిడీలతో నడుస్తున్నాయన్న అంశాన్ని గమనంలో వుంచుకోవాలి. ఇంగ్లాండులోనూ అమెరికాలోనూ హెచ్ఎస్ఆర్‌లు ప్రారంభించినా, నిర్వహణాభారం అధికమై, వారు రోడ్డు, విమాన మార్గాలపై ప్రధానంగా ఆధారపడి, వాటినే అభివృద్ధి చేసుకున్నారు.

అర్జెంటీనా 2006లో హెచ్ఎస్ఆర్‌ల నిర్మాణ, నిర్వహణకు ఫ్రాన్స్‌తో ఒప్పందం చేసుకుంది. 2008 ఆర్థిక మాంద్యంతో ఫ్రెంచ్ బ్యాంకులు అందజేస్తాయన్న రుణం ఆగిపోయింది. ఆపై అర్జెంటీనా చైనాతో ఒప్పందం చేసుకొని హెచ్ఎస్ఆర్‌లు తమ దేశంలో నడుపుతున్నప్పటికీ, అనేక ఇబ్బందులనెదుర్కొంటోంది.

## సమగ్ర దృష్టిలోపించిన పాలకులు

వాస్తవానికి ఇంధన పొదుపు, అతితక్కువ కాలుష్యం, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణానికి రైలుమార్గం అనుకూలమైంది. విశాలమైన మనదేశంలో, విస్తారమైన జనాభా గల ప్రాంతాలన్నింటి నడుమ రైలుమార్గాల నిర్మాణం చేసి ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య రవాణా సౌకర్యాలు పెంపొందించటం పాలకుల ప్రధాన కర్తవ్యంగా వుండాలి. అయితే రైల్వే లైన్ల నిర్మాణానికి పెట్టుబడి అధికంగా అవుతుందని, పెట్టిన పెట్టుబడి తిరిగి రావటానికి చాలాకాలం పడుతుందంటూ భారత పాలకులు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు కల్పించటంలేదు. దేశంలోని అన్ని ప్రాంతాలలో ఉత్పత్తి కార్యకలాపాలతో ముడిపడిన అభివృద్ధికి చర్యలు చేపట్టి, ఆ ప్రాంతాలన్నింటినీ రవాణా సౌకర్యాలతో అనుసంధానం చేయటం కంటే తక్షణ లాభాలనాశించటం జరుగుతోంది. ప్రజా ప్రయోజనం దృష్టితో ప్రజాధనాన్ని ప్రాధాన్యతా క్రమంలో వెచ్చించే పాలకులే శాస్త్రీయమైన అభివృద్ధిని, సక్రమ రవాణా వ్యవస్థను పెంపొందించగలుగుతారు. కానీ, బడ్జెట్టును కొల్లగొట్టే నిరంకుశాధికార పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాద గుత్తసంస్థల, సూపర్‌లాభార్జనల కోసం బుల్లెట్టు రైళ్ళు లేదా హెచ్.ఎస్.ఆర్‌ల నిర్మాణ, నిర్వహణకు భారత పాలకులు కంకణం కట్టుకొని తదనుగుణంగా ముందుకు సాగుతున్నారని స్పష్టమౌతోంది.

భారతదేశంలో నేడు నెలకొన్న సంక్షోభపరిస్థితుల నేపథ్యంలో ప్రజల పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి మరెన్నో సమస్యలకు తక్షణ ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాల్సివుండగా, ప్రజాధనాన్ని ప్రజోపయోగ ఉత్పత్తిరంగంలో వినియోగించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించాల్సి వుండగా పాలకులు ఈ తమ కర్తవ్యాలన్నింటినీ ప్రక్కనబెట్టి వెలుగు జిలుగులతో కళ్ళు బైర్లుకమ్మించి, దానినే నిజమైన అభివృద్ధిగా భ్రమలలో ముంచే ప్రయత్నం చేస్తున్నారు. దేశీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోకుండానే, అరువు సాంకేతిక విజ్ఞానంపై ఆధారపడి, సామ్రాజ్యవాద సంస్థల ముందు సాగిలబడి ప్రజాధనాన్ని భారీగా దోచిపెట్టి హెచ్ఎస్ఆర్‌లు, బుల్లెట్టురైళ్ళు ప్రవేశపెట్టటమే దేశానికి గర్వకారణమవుతుందా? అతికొద్దిమంది సంపన్నుల అవసరాలు తీర్చటం, బడా కార్పొరేట్లకు సూపర్ లాభాలను సమకూర్చి పెట్టటమేనా భారతదేశం ప్రకాశించటమంటే?!

తమ ఉపాధి - జీవన అవసరాల కోసం టిక్కెట్టు కొని రైళ్ళలో జనరల్‌బోగీలలో ప్రయాణించే సగటు ప్రయాణీకుడిని ఒక మనిషిగా కూడా గుర్తించని పాలకుల విధానాల్ని వ్యతిరేకించాలి. సామాన్య ప్రయాణీకుల సౌకర్యం ప్రాతిపదికగా రైల్వేలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయాలి. కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌లవద్ద అనునిత్యం జరుగుతున్న ఘోర ప్రమాదాలను ఎంతోమంది ప్రాణాలను బలితీసు కుంటున్నాయి. ఈ ప్రమాదాలను నివారించటానికి తగిన చర్యలు తక్షణం చేబట్టటంతోపాటు, రైల్వేలు తీసుకోవలసిన చర్యల గురించి పేర్కొన్న కాకోద్కర్ కమిటీ సూచనలు అమలుచేయాలని ఉద్యమించాలి. ఉన్నతవర్గ, సంపన్న ప్రయాణీకుల అవసరాలకోసం, బహుళజాతి, కార్పొరేటు సంస్థలకు రైల్వే వ్యవస్థను దోచిపెట్టే ప్రభుత్వ ప్రాధామ్యాలను వ్యతిరేకిస్తూ వీరోచితపోరాట సాంప్రదాయం కలిగిన రైల్వే కార్మికవర్గం, ప్రజానీకమంతా ఐక్యపోరాటాలు సాగించాలి. ✡

# భారతదేశాన్ని మాన్‌శాంటోకు దఖలు పరుస్తున్న పాలకులు

కొలిన్ టాడ్ హంటర్

*జన్యుమార్పిడి పరిజ్ఞానం, దాని వినియోగం, దాని దుష్ఫలితాలపై లోతుగా అధ్యయనం చేసిన కొలిన్ టాడ్ హంటర్ వ్యాసాన్ని అనువదించి యిస్తున్నాము. గ్లోబల్ రిసెర్చి వెబ్‌సైట్ నుండి దీనిని తీసుకున్నాము.*

*బహుళజాతి వ్యవసాయ కంపెనీల ఒత్తిడితో జన్యుమార్పిడి వంగడాల క్షేత్రస్థాయి ప్రయోగాలకు అనుమతినిచ్చేందుకు భారత ప్రభుత్వం పూనుకుంది. అలా ఇవ్వనందువల్ల భారత్ నష్టపోతోందనీ కనుక రాజకీయాలు లేని "నిపుణుల"తో కూడిన సంస్థకు ఈ పని అప్పగించాలని వాదనలు ముందు కొస్తున్నాయి. ఈ నేపధ్యంలో ఈ వ్యాసం జన్యుమార్పిడి పరిజ్ఞానాన్ని అనుసరించివచ్చే ప్రమాదాలను అర్థంచేసుకునేందుకు తోడ్పడుతుంది.*

*– సంపాదకుడు*

**అగస్టు** 15న భారతదేశం బ్రిటన్ నుండి స్వతంత్రం పొందిన తర్వాత 68వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఒకదేశం బహిరంగంగా స్వతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకొంటూనే, అదే సమయంలో మరోవైపున ఆ దేశాన్ని లోగుట్టుగా బయటివారికి ధారాదత్తం చేయటమనేది కొందరికి ఆశ్చర్యం గొలిపేదిగా వుండవచ్చు. సైనిక పాటవం, దేశభక్తి దట్టించిన ఉపన్యాసాల మీద – దేశభద్రత, స్వాతంత్ర్యమనేవి ఆధారపడి వుండవు. ఈ వాస్తవాన్ని ప్రకాశవంతమైన జెండాలు, జెండా ఆవిష్కరణలతో కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కళ్ళు మిరిమిట్లు గొలిపేవిధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఢిల్లీలో నిర్వహించారు. దాదాపు ప్రసారమాధ్యమాలన్నీ దేశ స్వాతంత్ర్యం, దేశం యొక్క శక్తి సామర్ధ్యాల గురించి గొప్పగా అభివర్ణిస్తూ కార్యక్రమాలు ప్రసారం చేశాయి. ఏమైనా, వాస్తవమేమిటంటే దేశ పునాదులను, దేశభద్రతలను కెళ్ళగించే, ధ్వంసంచేసే సామూహిక ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఏ దేశానికి పునాదైనా, ఆ దేశంలో సాగించే వ్యవసాయమే ! ఆహారం లేనిదే జీవితం లేదు. ఆహార భద్రత లేకుండా, నిజమైన అర్థంలో స్వాతంత్ర్యమనేది లేదు. ప్రపంచ ఆహారోత్పత్తిలో అత్యధిక భాగం చిన్న కమతాల నుండే వస్తోందని, పెద్దకమతాల కంటే, చిన్న కమతాలే అధిక ఉత్పత్తి సామర్ధ్యాన్ని కలిగివున్నాయని జి.ఆర్.ఏ.ఐ.ఎన్ (గ్రైన్) అనే సంస్థ ఇటీవల విడుదల చేసిన తన నివేదికలో పేర్కొంది. నిర్ణీత చట్రంలో పని విధానాన్ని నిర్దిష్టంగా రూపొందించుకోగలిగే కారణంగా, చిన్న కమతాల రైతులు ప్రపంచ ప్రజానీకానికి అవసరమైన ఆహారాన్ని సులభంగా అందించగలరు. కానీ, ప్రస్తుతం చిన్న రైతుల చేతులలోని భూములన్నీ గుంజివేయబడుతూ, ప్రపంచంలోని మొత్తం సాగుభూమిలో పావు భాగంకంటే తక్కువ భాగానికి వారు పరిమితం చేయబడ్డారు. మరోవైపున ప్రపంచంలో చిన్న కమతాలు, చిన్న వ్యవసాయదారులు త్వరితంగా తగ్గిపోతుండగా, శక్తివంతమైన, సంపన్న, బడా వ్యవసాయ వాణిజ్య సంస్థల చేతుల్లో ఆ భూమి కేంద్రీకృతమౌతూవుంది. ఈ ధోరణికి వ్యతిరేకంగా ప్రతిఘటనేమీ లేకుండా ఇలాగే కొనసాగితే, ప్రపంచం క్రమంగా తనకు తానుగా ఆహారాన్ని సమకూర్చుకునే సామర్ధ్యాన్ని కోల్పోతుంది.

సూత్ర ప్రకారం, రైతువారీ వ్యవసాయం స్థానిక, దేశీయ మార్కెట్ అవసరాలతోపాటు వారి కుటుంబ అవసరాల ప్రాధాన్యతాక్రమంలో ఆహారోత్పత్తి జరుగుతుంది. అత్యధిక ప్రజానీకపు ఆహార అవసరాలను తీర్చే అత్యంత సారవంతమైన భూములను కార్పొరేషన్లు తమ చేజిక్కించుకోని, లాభాలు సమకూర్చే ఆహారేతర సరుకుల ఉత్పత్తి కోసం సుదూర మార్కెట్ల ఎగుమతుల కవసరమైన పంటలను పండించటానికి ప్రాధాన్యతనిస్తాయి. ఈ క్రమం స్థానిక ప్రజాసమూహాలను పేదరికంలోకి నెట్టివేసి, ఆహార అభద్రతకు కారణమౌతుంది. కొద్దిమంది చేతుల నుండి అతి కొద్దిమంది చేతుల్లోకి సారవంతమైన వ్యవసాయ భూములు కేంద్రీకరించబడుతూ వుండగా, ప్రతిదినం ఆకలితో అలమటించే ప్రజల సంఖ్య పెరుగుతూ వుంది.

21వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాల కాలం ప్రపంచవ్యాపితంగా, దాదాపు అసాధారణ మోతాదులో భూమి చేతులు మారిన కాలంగా నిలిచిపోతుందని అమెరికాలోని ఓక్‌లాండ్ ఇన్‌స్టిట్యూట్ ఇటీవల ప్రకటించింది. రైతుల భూమి హక్కులను, స్థానిక ఆహార భద్రతను పణంగాపెట్టి 2000–2011 మధ్యకాలంలో అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాలలో 500 మిలియన్ల ఎకరాలు అంటే బ్రిటన్ పరిమాణం కంటే దాదాపు 8 రెట్ల వైశాల్యం గల భూమిని సంపన్నవర్గాలు కొనుగోలు చేయటమో లేదా లీజుకు తీసుకోటమో జరిగిందనేది ఒక అంచనా. ఈ ధోరణి అంతిమంగా, కుటుంబ వ్యవహారంగా వుండే భూమి యాజమాన్యం నుండి సంస్థాగత మదుపుదారుల, సంఘటిత కార్పొరేటు సంస్థల యాజమాన్యంయొక్క చేతులలోకి భూమి శాశ్వత బదలాయింపుకు దారితీస్తుంది.

## భారతదేశంలో మాన్‌శాంటో

భారతదేశంలోని మొత్తం వ్యవసాయ యోగ్యమైన భూములలో దాదాపు 40 శాతం భూమి, 92 శాతం చిన్న కమతాలుగా సాగుచేయబడుతోంది. ప్రజలకవసరమైన ఆహార ఉత్పత్తికి, ఈ కమతాలలో జరిగే సేద్యమే పునాదిగా వుంది. ఏమైనా, భూమి నుండి చిన్నపాటి రైతులను తొలగించే కలిసికట్టు ప్రయత్నమొకటి సాగుతోంది. 1997 నుండి చూస్తే, వందల, వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆర్థిక సరళీకరణ మరియు వాణిజ్య పంటలకు మరలటంతో మరి అనేకమంది తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవటమో లేక ఈ అప్పుల కారణంగా వ్యవసాయంనుండి తప్పుకోవటమో జరుగుతోంది.

మాన్‌శాంటో ఇప్పటికే భారతదేశంలో పత్తి పరిశ్రమను తన అదుపులో వుంచుకుంది. భారత దేశంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు, సంస్థలకు నిధులను సమకూర్చటం ద్వారా, దేశ వ్యవసాయ విధానాన్ని, సిలబస్‌ను మలిచే ప్రక్రియ పెరుగుతోంది. దేశంలో మాన్‌శాంటో ఆచరణతీరు, సంస్థలను తనకు లోబరుచుకునే 'వలసీకరణ'లతో, అది 'ప్రస్తుతకాలపు ఈస్ట్ ఇండియా కంపెనీ'గా పిలవబడుతోంది. కాగా, జన్యుమార్పిడి సంస్థలపై చర్యలు తీసుకోవటానికి వచ్చే సరికి ప్రభుత్వ సంస్థలన్నీ తీవ్రంగా రాజీలు పడిపోయి, తమ స్వార్ధ ప్రయోజనాలతో వివాదపడుతూ స్తబ్దుగా మారిపోయాయి.

ప్రపంచంలో పెద్దఎత్తున పెరుగుతోన్న జనాభా అంతటికీ అవసరమైన ఆహారాన్ని అందించాలంటే జన్యుమార్పిడి సాంకేతికత అవసరమని ఈ మధ్య కాలంలో జన్యుమార్పిడి జీవసాంకేతికరంగం ఒక అభూతకల్పనను ప్రచారంలో పెడ్తోంది. ఇవేవీ వాస్తవాలుకావు. 'గ్రెయిన్' సంస్థ పరిశీలన–సమీక్షలను ప్రక్కనబెట్టినప్పటికీ, ప్రపంచబ్యాంకు నిధులతో నడుస్తోన్న 'ఇంటర్నేషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ నాలెడ్జి అండ్ సైన్స్ ఫర్ డెవలప్‌మెంట్' సంస్థ యొక్క నివేదిక ప్రకారం కూడా రక్షణాత్మక వ్యవసాయ, పర్యావరణ వ్యవస్థల ద్వారా చిన్న కమతదారులు, సాంప్రదాయక వ్యవసాయమే, చిన్న ఆదాయాలున్న దేశాలలో ఆహార భద్రతను కల్పించ గలుగుతాయని పేర్కొంది.

జన్యుమార్పిడి వంగడాలు, జన్యుమార్పిడి పంటల ఆహారం మానవుల ఆరోగ్యానికి, జంతుజాలం, పర్యావరణాలకు ప్రమాదకరమైనవని వ్యవసాయంపై ఏర్పరచిన పార్లమెంటు స్థాయీ సంఘం పేర్కొంటూ, మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వాన్ని జన్యుమార్పిడి సంస్థలను నిషేధించవలసిందిగా కోరింది. ఈ విధమైన సిఫార్సులు, సాక్ష్యాల ఆధారంగా జన్యుమార్పిడి విత్తన ప్రయోగాలు జరపటాన్ని సుప్రీం కోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటి నిలిపివుంచాల్సి వుండగా, ఉన్నతాధికార వర్గాలు ఈ ప్రయోగాలకు ఆమోదం తెలిపే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

## విశ్వసించదగని మాన్‌శాంటో

జన్యుమార్పిడి జీవసాంకేతిక రంగం విశ్వసనీయమైనది కాదు. అన్నీ తెలిసే ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీయటం, పర్యావరణాన్ని కలుషితం చేయటం, దశాబ్దాలుగా మోసం, వంచన, నేరాలతో కూడిన చరిత్ర కలిగిన మాన్‌శాంటోనే జన్యుమార్పిడి జీవసాంకేతిక రంగంలో పెద్ద భాగస్వామిగా వుంది. మానవ జీవితానికి హానికల్గిస్తూ, పర్యావరణాన్ని పదేపదే ధిక్కరిస్తూ, ప్రజలకు అందించే ఏ రూపంలోని సేవకైనా లాభాపేక్షే ప్రధానమైనదిగా నిరూపితమైన మాన్‌శాంటో, ఇప్పటికి కూడా జన్యుమార్పిడి సంస్థల యొక్క 'అభివృద్ధి చెందిన సాంకేతికత' ఆకలితోనున్న కోట్లాది మందికి ఆహారభద్రతను కల్పిస్తుందని, మానవత్వపు ముఖ్యమైన ప్రయోజనాలే తన హృదయంలో వున్నాయనే బూటకపు ప్రచారాన్ని కొనసాగిస్తోంది.

జన్యుమార్పిడి విత్తన సంస్థలు తమ ఉత్పత్తులపై అసమగ్రమైన, స్వీయ అధ్యయనాలు జరిపించుకొనటం; తమ ఉత్పత్తులపై జరిగే ఏ స్వతంత్ర పరిశోధనపైన అయినా ఆంక్షలు విధించటం; తమ ఉత్పత్తుల దుష్ప్రభావాలను వెలికితెచ్చే నిర్ధారణలన్నింటినీ వెలుగు చూడకుండాజేయటంవంటి కుటిల పద్ధతులద్వారా తమ ఉత్పత్తుల చుట్టూతా 'విజ్ఞానాన్ని' అదుపుజేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇవన్నీ వాటి గురించి అవాస్తవ సమాచారాన్నే అందిస్తాయి. తమ ప్రయోజనాలకు నష్టం కల్గించే నిర్ధారణలకు వస్తారనుకున్న శాస్త్రవేత్తలపై దాడులకు సైతం పాల్పడతాయి. జన్యుమార్పిడి విత్తనాలతో దిగుబడులు మెరుగ్గా వున్నాయని, పౌష్టికాహార విలువలు పెంపుజేయబడ్డాయని, ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరం కాదని నిరూపించే ఒక్కగానొక్క ప్రయోగాన్ని అయినా ఈ సంస్థలు ఎక్కడా ప్రదర్శించి చూపలేదు. జిఎమ్‌ఓల నిధులతో సాగే అసమగ్ర పరిశోధనలు గాకుండా, సమగ్ర, స్వతంత్ర అధ్యయనాలన్నీ, జన్యుమార్పిడి విత్తనాల కారణంగా దిగుబడులు దారుణంగా వున్నాయనీ, క్రిమిసంహారకాల వాడకం పెరిగిందనీ, మానవుల ఆరోగ్యంపై ఇవి తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయనీ, భూసారం దెబ్బతింటోందనీ, జీవవైవిధ్యం నాశనమౌతుందనే అనేక వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయి.

రష్యా తమ వ్యవసాయోత్పత్తుల మొత్తంలో 56శాతాన్ని, వ్యవసాయ యోగ్యమైన భూమిలో 9శాతం కంటే తక్కువ భూభాగంలోని కుటుంబ వ్యవసాయం ద్వారా సాధించగలుగుతోందని 'గ్రైన్' పేర్కొంది. రష్యాలో జన్యుమార్పిడి పంటల అవసరం లేదంటూ, కొద్దిపాటి తేడాతో అవి జీవసాంకేతిక రసాయన ఆయుధాలేనని రష్యా ప్రధాని అభివర్ణించాడు. ఇక్కడే అసలు విషయం ఇమిడివుంది. అమెరికా మాజీ రక్షణశాఖామంత్రి హెన్రి కిసెంజర్ ఒక సందర్భంలో మాట్లాడుతూ 'చమురు వనరులపై అదుపు సాధించితే దేశాలను అదుపుచేయవచ్చు. కానీ ఆహారంపై అదుపు సాధించితే ప్రజలను అదుపు చేయవచ్చు'నని పేర్కొన్నాడు. ప్రపంచ ప్రజలకు ఆహారాన్ని అందించేందుకు జిఎమ్‌ఓల అవసరంలేదు. వాటి వినియోగాన్ని శాస్త్ర పరిజ్ఞానం సమర్ధించజాలదు. అవి ఆయుధాలుగా ఉపయోగించబడుతున్నాయి.

భారతదేశంలో, దేశ ప్రజలకు ఆహార భద్రతను కల్పించగలిగే చిన్న కమతాలను, కుటుంబ సేద్యాన్ని తొలగించివేస్తున్నారు. ఆ భూముల్లో పశ్చిమ దేశాల తరహాలో 'తయారైన ఆహార' ఉత్పత్తులకోసం, ఎగుమతులకోసం జీవ సాంకేతిక సంస్థల ఆధ్వర్యంలో జన్యుమార్పిడి విత్తనాలనుపయోగించి భారీ స్థాయిలో ఏక పంట విధానాన్ని అంతిమంగా ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. సింజెంటా, మాన్‌శాంటో, వాల్‌మార్ట్‌వంటి సంస్థలకు వ్యవసాయరంగంలో 'విజ్ఞాన చౌరవ' ఒప్పంద రూపకల్పనలో ప్రత్యక్ష హస్తముండగా, దానికి బదులుగా భారత అణువిద్యుత్తు రంగానికి అమెరికా అనుమతులీయటంతో ఇది అనుసంధానం చేయబడివుంది.

అణునిరాయుధీకరణ ఒప్పందంపై భారతదేశం సంతకం జేయనప్పటికీ, భారతదేశం తన పౌర, అణుసామర్ధ్యాలను అభివృద్ధిచేసుకునేందుకు అమెరికా కార్పొరేటు సంస్థలు జోక్యంచేసుకొని చురుగ్గా సహాయ సహకారాలందిస్తున్నాయి. దీనికి బదులుగా దేశంలోని బహుళజాతి జీవసాంకేతిక పరిశ్రమలద్వారా భారత వ్యవసాయ భూములను, ఆహారవ్యవస్థను అమెరికాకు ధారాదత్తం చేసే రూపంలో తిరిగి చెల్లింపు ముందు కొచ్చినట్లుగా కనపడుతోంది.

## జన్యుమార్పిడి సంస్థల నిజస్వరూపం

జీవ విధ్వంస బీభత్సాన్ని, జిఎమ్‌ఓలను ఒకే గాట్నకట్టి రష్యా సరిగ్గా పేర్కొంది. చమురు వనరులతో సమృద్ధమైన రాక్‌ఫెల్లర్, వారి అనుంగు సంస్థలు ప్రపంచ వ్యవసాయాన్ని అదుపుచేయటానికి పెట్రో రసాయన ఆధారిత 'పైరుపచ్చ విప్లవాన్ని' ముందుకు తెచ్చారు. కిసెంజర్ పైన పేర్కొన్న ఎజెండా ప్రకారం అమెరికా ప్రభుత్వం, వారి అనుంగు వ్యవసాయ సాంకేతిక కార్పొరేషన్లు పూనుకొని సాంప్రదాయకంగా రైతు అదుపులో వుండే వ్యవసాయ విధ్వంసానికి చురుగ్గా మద్దతునిచ్చాయి. 'టెర్మినేటర్' (గొడ్డుమోతు) విత్తన సాంకేతికత, విత్తనాలపై పేటెంటు హక్కులు, మేధోపర హక్కులు మొదలైన వాటిద్వారా ఇప్పుడు జన్యుమార్పిడి సంస్థలు ఆహారంపై అంతిమంగా తమ ఉడుంపట్టును బిగించనున్నాయి.

మీదు మిక్కిలి, ఆఫ్రికాలో మాన్‌శాంటోతో జట్టుకట్టిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ మరియు గేట్స్ ఫౌండేషన్ సంస్థలకు 'మూడవ ప్రపంచ' దేశాలలో అధిక జనాభాగురించి, వారు ఏవిధంగా అభివృద్ధి చెందుతారనే దానిగురించి, పశ్చిమ దేశాలు అభివృద్ధి చేసే వనరులను బెరింపులకు గురిచేయటం గురించి దీర్ఘకాలంగా చాలా ఆలోచనలున్నాయి. వాస్తవానికి మాన్‌శాంటో ప్రస్తుతం గొడ్డుమోతు లక్షణాలను కలిగించే 'ఇపిసైట్' అనే జన్యువును కలిగివుంది. మరి 60 కోట్ల భారతీయులు, కోట్లాది మంది ఆఫ్రికన్లు, ఇలా అనేక ప్రాంతాలలో వ్యవసాయంనుండి తొలగించబడిన వారందరికీ 'అంతిమ పరిష్కారం' ఏమిటి? సంతతి విజ్ఞానశాస్త్రవేత్తలు సంసిద్ధంగా ఉండటమేనా?!

ఉన్నత స్థానాలలోనున్న రాజకీయ నాయకులు, అధికారులు, జిఎమ్‌ఓల గురించి అనేక ఆరోపణలు తమ ముందున్నప్పటికీ మాన్‌శాంటోకు, అమెరికాకు దాసోహంచేస్తున్నారు. కానీ జన్యుమార్పిడి విత్తన సంస్థలతో ముడిపడిన ప్రమాదాలగురించి అనేకమంది గుర్తించి, వాటి ప్రవేశాన్ని నిరోధించటానికి తీవ్రంగా కృషిచేస్తున్నారు. జిఎమ్‌ఓలను వ్యతిరేకించటమంటే అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలను, దాడులను వారంతా ఎదుర్కొంటున్నారు. కొన్ని పౌర సంస్థలు, కొందరు కార్యకర్తలు విదేశీ ప్రయోజనాలతో కుమ్మక్కై, దేశీయ అభివృద్ధిని క్షీణింపజేయటానికి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణలనెదుర్కొంటున్నారు. ఆశ్చర్యమేమంటే, సాంప్రదాయ వ్యవసాయ పునాదిని దెబ్బతీస్తూ, దీర్ఘకాలంగా విదేశీ ప్రయోజనాలతో అంటకాగుతోన్న ప్రభుత్వమే ఈవిధంగా వ్యాఖ్యానిస్తోంది. కళ్ళు చెదిరే నయవంచనకు ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి?!

జన్యుమార్పిడి విత్తన సంస్థలకు అమెరికా రక్షణశాఖ రాజకీయ దన్ను, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలలో అమెరికా జీవసాంకేతిక రంగపు వ్యూహాత్మకస్థానం, ఉన్నతాధికారుల మరియు కీలకమైన శాఖల తోడ్పాటుతో బహిరంగంగా జన్యుమార్పిడి పంటల క్షేత్రస్థాయి ప్రయోగాలతో జిఎమ్‌ఓలను భారతదేశంలోకి నెట్టి, వ్యవసాయాన్ని కాలుష్యం చేయబూనుకున్న ఈ పరిణామాలేవీ శుభసూచకం కావు. ప్రతిసంవత్సరం స్వాతంత్ర్య దినాన సైనిక పాటవాలు, దేశభక్తి నినాదాలు, పిచ్చెత్తినట్లుగా ప్రచార మాధ్యమాలు ముంచెత్తే స్వీయపొగడ్తలకంటే 'స్వాతంత్ర్యం' చాలా ఉన్నతమైనది. జిఎమ్‌ఓల విషయంలో, రష్యా జాగరూకతతోవుంది. జన్యుమార్పిడి సంస్థల జన్యువును సీసాలో తిరిగి ప్రవేశపెట్టేందుకు నిశ్చయాత్మకంగా చురుగ్గా వుంది. భారతదేశం ఆవిధంగా ఎందుకు లేదు?

"భారతదేశానికి, భారత ప్రజలకు ఇంకా ఉన్నతమైన మానవత్వానికి సేవజేసేందుకు మనం అంకితమవుతున్నామని ప్రతిజ్ఞచేసే ఈ పవిత్ర క్షణం చాలా సరైనది....ఈరోజున మనం సాధించుకున్న దానికి సంబరాలు జరుపుకుంటున్నాం...మనం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మరెన్నో విజయాలకు ఇది నాంది కావాలి....భవిష్యత్తు సవాళ్ళను ఆమోదించటానికి, ఈ అవకాశాన్ని గ్రహించటానికి తగిన ధైర్యాన్ని, తెలివితేటలను కలిగివున్నామా? ఒక కొత్త నక్షత్రం పైకెగసింది...నూతన ఆశలను రేకెత్తించే స్వేచ్ఛా తూరుపు నక్షత్రమది. దీర్ఘకాలపు చూపులు ఫలించాయి. ఆ నక్షత్రం ఎన్నటికీ అస్తమించదని, ఆశ ఎన్నటికీ విద్రోహానికి గురికాదని ఆశిద్దాం." **(1947లో పార్లమెంటు భవనంలో జవహర్‌లాల్ నెహ్రూచేసిన 'ట్రిస్ట్ విత్ జెస్టిని' నుండి)**

Class Struggle
Organ of Central Committee of CPI (ML)

వర్గ సంఘర్ష్ కా పుకార్
Hindi Organ of Central Committee of CPI (ML)

# అనంతపురంజిల్లాలో కొనసాగుతున్న కరువు-రైతుల బలవన్మరణాలు

*సెప్టెంబరు మొదటివారంనాటికి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ సగటున వర్షపాతం 33 శాతం లోటు వుంది. తూర్పుగోదావరి, నిజామాబాద్ జిల్లాలలో 50 శాతం లోటు వుంది. 40 శాతం భూమిలో వరినాట్లు పడలేదు. నాట్లుపడ్డ భూమిలో కూడా దిగుబడులు 30 శాతం తగ్గవచ్చు. రాయలసీమలో వేరుశనగ పంట 30 శాతం భూమిలోనే సాగు అయింది. సాగుభూమిలో కూడా దిగుబడులు 40 శాతం తగ్గే స్థితిలో పంట ఎండిపోతున్నది. కరువు కమ్ముకొస్తున్నా ఎగువ రాష్ట్రాలలోపడ్డ వర్షాలకు జలాశయాలు నిండుతున్నాయంటూ కరువు స్థితిని తగ్గించి చూపుతున్నారు తప్ప రైతుకు సహాయమందించే చర్యలు చేపట్టలేదు. వానలు ఆలస్యమైనందున ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికా లేదు. నిండిన జలాశయాల నుండి ఆయకట్టుకు నీటివిడుదల టైమ్‌టేబుల్ ఊసూలేదు. కరువు మండలాలను గుర్తించే పనీ చేపట్టలేదు. చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించామన్న మంత్రుల ప్రకటనలు తప్ప ఆచరణ శూన్యం. కొత్త రాజధాని గురించి మంత్రుల పర్యటనలకే ఎక్కడి సమయం చాలటంలేదు. పాలకుల నిర్లక్ష్యంతో కరువు కరాళ నృత్యం ఎలా వుండబోతుందో ఈ నివేదిక తెలుపుతుంది.*

**– సంపాదకుడు**

**గత** ఆరు సంవత్సరాలనుంచీ అనంతపురం జిల్లాలో పంటలు పండటంలేదు. అదునులో వర్షాలు రాకపోవడమో, అవసరమైన సందర్భాలలో వర్షాలు పూర్తిగా ఎగవేయడమో జరుగుతున్నది. పంట పెట్టుబడులు కూడా, రాకపోవడంచేత బ్యాంకులలో అప్పులు, బంగారం తాకట్లు, ప్రైవేట్ వడ్డీవ్యాపారులవద్ద అప్పులతో రైతులు కుంగిపోతున్నారు. ఆరు సంవత్సరాల పంట పెట్టుబడులు రైతుల రుణభారంగానే మారిపోయినాయి. జిల్లాలో 25 లక్షల ఎకరాల సాగుభూమికి పూర్తిగా వర్షాధారంకింద పండే ఒక పంటే ఆధారం. 7 లక్షల రైతు కుటుంబాలన్నీ వ్యవసాయంమీదనే ఆధారపడినాయి. ఇందులో అత్యధిక కుటుంబాలవారు సన్న, చిన్నకారు రైతులే. నష్టాలను, అప్పులను భరించలేక 2013లో 5 లక్షల ఎకరాలలో అసలు విత్తనం వేయలేదు. ఈ సం॥ ఖరీఫ్‌లో దాదాపు 7 లక్షల ఎకరాలు బీళ్ళు పడినాయి. వేసిన విత్తనం కూడా మొలకెత్తక, మొలకెత్తినవి పెరగక పైర్లు కునారిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధికోసం వలసలు, రైతుల ఆత్మహత్యలు పెరిగి పోయినాయి. 1999 నుండీ 2013 ఆఖరువరకూ జిల్లాలో మూడువేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ఈ సంవత్సరం 2014 జనవరి నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు 30మంది దాకా ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఈ నేపథ్యంలో జిల్లాలో ఆత్మహత్యచేసుకున్న కొన్ని రైతు కుటుంబాలను పరామర్శించిన వాస్తవ పరిశీలనబృందం, సమస్యల్ని అధ్యయనం చేసింది. ఈ బృందంలో కా॥బి.తిమ్మారెడ్డి, రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి శ్రీ యస్.యం.బాషా, మానవహక్కుల వేదిక శ్రీ విజయకుమార్, ఒపిడిఆర్ నాయకులు వున్నారు. ఈ బృందం 9-9-2014, 11-9-2014 తేదీలలో కూడేరు, డి.హీరేహాల్ మండలాల బలవన్మ రణాలకు పాల్పడిన రైతుకుటుంబాలను కలిసి వివరాలు సేకరించింది.

### (1) రాముడు (35 సం॥) ఆయన భార్య సుంకమ్మ (30 సం॥) – పులపర్తి గ్రామం

ములిగుగారి రాముడు తమ గ్రామానికి 20 కి.మీ. దూరంలో ఉన్న కర్ణాటకలోని బళ్ళారి నగరంలో హమాలీ పనిచేసుకుని బతికేవాడు. స్వంతభూమిలేదు. ముగ్గురు పిల్లలు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆలోచనతో భార్యాభర్తలిరువురూ గ్రామంలోని గౌడు భూస్వామివద్దనుంచి 8 ఎకరాల వర్షాధార భూమి కౌలుకు తీసుకుని 8 సంవత్సరాలనుంచీ సాగు చేస్తున్నారు. గత నాలుగు, అయిదు సంవత్సరాలుగా పంటలు సరిగా పండక నష్టాలు వచ్చినాయి. దాదాపు 2 లక్షలదాకా అప్పులయినాయి. వ్యవసాయం మాని వేయమని భార్య, మానితే అప్పులు తీరేదెట్లా అని భర్త, ఎంతో అన్యోన్యంగా, ఒకరికొకరు తోడూనీడగా వుండే భార్యాభర్తలమధ్య నిత్యం అప్పులగురించి మాటల యుద్ధం సాగుతూవచ్చింది. 21-6-2014న రాత్రి వారి మధ్య జరిగిన ఘర్షణలో భార్య మరణించింది. దీనితో ఇంటిముఖం చూడలేక హీరేహాల్ గ్రామశివార్లలో రాముడు చెట్టుకు ఉరివేసుకుని ఉదయానికి శవమై తేలాడు. ఈ ఇద్దరి హఠాన్మరణాల్ని చూసిన రాముడి తండ్రి హులిగప్ప (60సం) 16 రోజుల తర్వాత మనోవేదనతో చనిపోయినాడు. పిల్లలు శివకుమార్ (9 సం) కూతుర్లు ఉష (7 సం) కీర్తి (6సం) అనాథలయినారు. ఏ ఆసరాలేని నాయనమ్మ చిన్నలింగమ్మే (55సం) వారికి దిక్కు అయింది. అధికారులు, పోలీసులు కేసు రాసుకునివెళ్ళినా, మూడు నెలలు కావస్తున్నా వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. ఆఖరికి చిన్న లింగమ్మకు వృద్ధాప్య పెన్షను కూడా మంజూరు కాలేదు.

### (2) బోయ ఆంజనేయులు (60సం॥) – కాదలూరు గ్రామం

బోయ ఆంజనేయులుకు 3 ఎకరాల పొలం వుంది. పిల్లలు లేరు. భార్యాభర్తలు ఇరువురు మాత్రమే. పంటలు పండడం లేదు. భర్త తాగుడుకు అలవాటు పడ్డాడు. అప్పులు పుట్టడం లేదు. 6-8-2014న పురుగుల మందు తాగి ఊరిబయట చనిపోయినాడు. భార్యగంగమ్మ ఒక్కతే మిగిలింది. విచారణ చేసిన ఆర్‌డిఓ వ్యవసాయ సంబంధమైన ఆత్మహత్య కాదని ప్రకటించినాడు.

### (3) బోయ ఈరన్న (48 సం) – డి.హీరేహాల్ గ్రామం

మండల కేంద్రంలో నివాసముండే బోయ ఈరన్నకు భార్య, గంపెడంత సంసారం. స్వంతంగా భూమిలేదు. గత 10 సంవత్సరాలనుంచీ అయిదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటపెట్టుబడులు, కౌలు రుసుముకు – దిగుబడులకు లంకెకుదరక అప్పుల పాలయినాడు. అప్పులు తీర్చేద మెలానో తెలియక మనస్థాపంతో వుండేవాడు. 6-8-2014న రాత్రి ఇంటిబయటపడుకున్నాడు. రాత్రి పది గంటల సమయంలో కేక వినపడింది. కుటుంబ సభ్యులు బయటికి వచ్చి చూసినారు. ఈరన్న మంచం మీద లేదు. కేకవచ్చిన దిక్కుగా వెతుక్కుంటూ వెళ్ళారు. ఇంటికి అర్ధఫర్లాంగ్ దూరంలో వున్న కరెంటు డి.పి.వద్ద వీరన్న విగతజీవిగా పడివున్నాడు. పక్కనే పత్తి పంటకని తెచ్చుకున్న పురుగులమందు డబ్బా పడివుంది. నోరు పురుగుమందుల వాసనతో నురుగువస్తోంది. ప్రయత్నం చేసినా బతుకలేదు.

విచారణ బృందం ఎఫ్ఐఆర్ కాపీ పరిశీలిస్తే కడుపునొప్పితో పురుగుమందు తాగి చనిపోయాడని భార్య నరసమ్మ రాసిన అర్జీ వుంది. ఎక్కడా రైతుగాగానీ, వ్యవసాయ రుణభారం ప్రసక్తిగానీ లేదు. ఎందుకు ఈ విధంగా రాసి ఇచ్చినావని నరసమ్మను అడిగితే, అప్పులవల్ల చనిపోయినాడని నమోదుచేస్తే, పరిహారం రాదని, కడుపునొప్పి వల్ల చనిపోయినాడని స్టేట్‌మెంట్ ఇస్తే ప్రభుత్వంనుంచి పరిహారం వస్తుందని హెడ్‌కానిస్టేబుల్ నమ్మబలికితే, సంతకం చేసినానని, తనకుగానీ, తన కుటుంబ సభ్యులకుగానీ చదువురాక పోవడంవల్ల ఏమి రాసుకున్నది తమకు తెలియదని నరసమ్మ చెప్పింది. ఎఫ్ఐఆర్ ప్రకారం ఈ కేసు 421 జిఓ.పరిధిలోనికి రాదు. అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధికారులు ఈరన్న కుటుంబ సభ్యులను తప్పుదోవ పట్టించారు. అధికారుల నిర్వాకంపై విచారణ చేసి, ఈరన్నమరణాన్ని ఆత్మహత్యగా నమోదు చేయాలి.

### (4) నేసే ఒన్నూరప్ప(50సం), నారాయణమ్మ (45సం) – అంతరగంగ గ్రామం

29-6-2014న నేసే ఒన్నూరప్ప, ఆయన భార్య నారాయణమ్మ పురుగుమందుతాగి, గ్రామ శివార్లలోని యల్లమ్మ దేవాలయంలో చనిపోయినారు. ఎవరికీ తెలియదు. 30-6-2014న గొర్రెలు మేపుకునే అమ్మాయిచూసి ఈ విషయం గ్రామస్తులకు చేరవేసింది.

వివరాల్లోకి వెళ్తే, నేసే ఒన్నూరప్పకు 8 ఎకరాల మెట్టపొలం వుంది. ఆయన పూర్వీకులు కూడా కులవృత్తిని మాని వ్యవసాయంలో స్థిరపడినవారు. 10-15 సంవత్సరాలనుండీ పంటలు సరిగా పండని స్థితిలో ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ఒన్నూరప్పకు ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కుమారులు. ఒక కమారుడు ఇటీవలనే ప్రమాదంలో మరణించినాడు. ముగ్గురు కూతుళ్ళకు పెళ్ళిళ్లు అయిపోయినాయి. పంటలు పెట్టకుండా మానలేదు. మరోపని తెలియదు. అప్పులు ఎక్కువయినాయి. నాలుగు ఎకరాల పొలం అమ్మి బాకీలు తీర్చినాడు. ఆ తరువాత కూడా అప్పులు అయినాయి. ఉన్న పొలం అమ్మలేదు. అప్పులవారి ఒత్తిడి ఎక్కువయింది. భార్యాభర్తలిరువురూ మండల కేంద్రమైన కూడేరుకు వెళ్ళివచ్చినారు. ఏమి మాట్లాడుకున్నారో తెలియదు. మరుసటిదినం శవాల పక్కన పురుగుమందులడబ్బా. పురుగుమందుల వల్ల పురుగులు చావడం లేదని కొందరి రైతుల అభియోగం. ఇది అబద్ధం. చిన్నపాటి పురుగులు చావకపోతే, ఇంత పెద్ద శరీరాలున్న మనుషులు ఎట్లా చచ్చిపోతున్నారు?!

సంఘటన జరిగి మూడు నెలలు గడిచిపోయినా, ఇంతవరకూ ప్రభుత్వంనుంచి వీసమెత్తు సహాయం కూడా అందలేదు. పోలీసులు రిపోర్టు ఇవ్వలేదని రెవెన్యూవాళ్ళు చెప్పారని, ఆ రిపోర్టుకోసం ప్రతిదినం పోలీసు స్టేషనుచుట్టూ తిరుగుతున్నారని ఒన్నూరప్ప అన్న పరిశీలనా బృందానికి చెప్పినాడు. విషయం తెలుసుకుందామని కూడేరు మండలకేంద్రంలో వున్న పోలీసుస్టేషనుకెళితే, వారు రిపోర్టు ఇచ్చినట్లుగా తెలిపారు. ఆ తర్వాత తహశీల్దారుగారిని విచారిస్తే, డిఎస్‌పిగారి సంతకం ఆలస్యం అయింది. పూర్తిచేసుకుని ఆ దినమే పంపిస్తున్నామని చెప్పినారు.

421 జీఓ వల్ల రైతుల సమస్యలు పరిష్కారం కావు. కానీ బాధిత కుటుంబాలకు తక్షణ ఉపశమనమన్నా లభించాలి. అయితే, నెలల తరబడి బాధిత కుటుంబాలు పోలీసుస్టేషన్ల చుట్టూ, రెవిన్యూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సివస్తోంది. విచారణ పూర్తిచేసి సహాయం అందించడానికి కాలపరిమితి లేకపోవడం వలన బాధితుల కష్టాలు చెప్పనలవికావు. సాధారణంగా ఆత్మహత్యలు పురుషులే చేసుకుంటారు. మహిళలు కార్యాలయాలచుట్టూ తిరగడం అధికారులను కలవడం సాధ్యంకాని పని.

12 సంవత్సరాలనుంచీ జిల్లాలో ఆత్మహత్యలు కొనసాగుతున్నా, రైతుల మనోవేదనకు, కష్టాలకు కారణమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయకపోవడం విషాదం. రాజకీయ నాయకుల ప్రాపకం వుంటేతప్ప, పరిహారంకోసం ప్రతిపాదనలు సిద్ధంకావు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం రైతు ఆత్మహత్య జరిగినప్పుడు పోలీసు పంచనామా ఎఫ్ఐఆర్‌తోపాటు రెవిన్యూ డివిజనల్ అధికారి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, వ్యవసాయ సహాయసంచాలకుడు ముగ్గురూ కలిసి విచారణచేసి, పరిహారంకొరకు జిల్లా కలెక్టరుకు ప్రతిపాదనలు పంపాలి. ఈ ముగ్గురు అధికారులు కలిసి సంతకాలు చేయడం సాధారణంగా కుదరదు. నెలల తరబడి జాప్యం జరుగుతుంది. వారికి ఈ కేసులు అప్రధాన విషయాలుగా కనిపిస్తాయి.

ఏదైనా సామాజిక విపత్కర పరిస్థితులు ఏర్పడినపుడు ఆ సమస్య మూలకారణాల్ని కనుగొని యుద్ధప్రాతిపదికన ఆ సమస్యల్ని, విపత్తును పరిష్కరించడానికి, కొత్తగా విస్తరించకుండా ఉండడానికి జవాబుదారీ ప్రభుత్వాలు కృషిచేయాలి. అసలు రైతుల ఆత్మహత్యలు సామాజిక విపత్తుగా పరిగణించక పోవడమే ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం, నేరస్వభావం.

రైతు బలవన్మరణం చెందితే అది రైతు కుటుంబానికి వచ్చిన ఆపదమాత్రమేకాదు; అది సమాజానికి వచ్చిన ఆపద. నాగరిక సమాజం సిగ్గుపడాల్సిన ఆపద. సిగ్గులేని ప్రభుత్వాల నిలువెత్తు అసమర్థత, బాధ్యతారాహిత్యం. మార్కెట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వాల దళారి విధానాలకు వ్యతిరేకంగా రైతులు సంఘటితం అయ్యేంతవరకూ పరిష్కారాలు లభించవు. అందుకే రైతుల ఆత్మహత్యలన్నీ సర్కారీ హత్యలేనని బృందం ప్రకటించింది. ✸

## పేదల నివేశ స్థలాల మంజూరుపై నిషేధానికి వ్యతిరేకత

**బందరు, 18-8-14:**

ప్రభుత్వం పేదలకు ఇచ్చే నివేశన స్థలాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని, అర్హులైన పేద లందరికీ ఇళ్ళస్థలాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) బందరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో 18-8-2014 తేదీన మచిలీపట్నం కలక్టరు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥జె. జగన్ మాట్లాడుతూ రాజధాని ఏర్పాటుకు, పోర్టుకు, రహదార్ల విస్తరణకు, ఇతర ప్రాజెక్టులకు భూమిని సేకరించేందుకు, అనేక సం॥లుగా ఇళ్ళస్థలాలను పేదలకు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం తాజాగా పేదలకు ఇచ్చే ఇళ్ళస్థలాలపై నిషేధాన్ని విధించటం అన్యాయమన్నారు. బడా కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చే పనులకు, ప్రాజెక్టులకు భూమి కేటాయిస్తారు కానీ అనేక సంవత్సరాలుగా ఇల్లు కట్టుకోవాలనే ఆశతో ఎదురు చూస్తున్న ఇళ్ళస్థలాలపై నిషేధం విధించటం ద్వారా ప్రభుత్వం సంపన్నుల ప్రయోజనాలను నెరవేరుస్తూ పేదప్రజల ప్రయోజనాలను విస్మరిస్తోందని, పాలకుల వర్గస్వభావాన్ని అర్థంచేసుకొని ఇళ్ళస్థలాలులేని పేద లందరూ సమైక్యంగా ఆందోళన చేయాలని పిలుపు నిచ్చారు. స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥పొమర్తి అంజమ్మ మాట్లాడుతూ "అనేక సం॥లుగా ఇళ్ళ పట్టాలకోసం అరుణోదయ కాలనీ, ఆదర్శనగర్, భాస్కరపురం డ్రైనేజీప్రక్కన పేదలు పాకలు వేసుకొని చాలా సం॥లుగా జీవిస్తున్నా, అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదన్నారు. పేదలంతా సమైక్యపోరాటాలు సాగించటంమినహా మరోమార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥ఎం.సుధాకరరావు, జి.మల్లేష్, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు ఈపూరి రాంబాబు, కా॥కొప్పినేని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నాలో అరుణోదయకాలని, ఆదర్శనగర్, టీఎన్ నగర్, ఆశీర్వాదపురం, భాస్కరపురం, లక్ష్మణరావుపురం పేదలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టరుకు మెమోరాండం సమర్పించారు. ✸

## రేషన్ షాపులద్వారా పేదలకు అందించే సబ్సిడీ సరుకులలో కోతకు నిరసన

**బందరు, 26-8-14**

రేషన్‌షాపుల ద్వారా పేదప్రజలకు సబ్సిడీపై అందించే 9 రకాల సరుకులను నిలిపివేయాలని పౌరసరఫరాశాఖ ఆదేశించటాన్ని నిరసిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో మచిలీ పట్నం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకందించే సంక్షేమ పథకాలను ఒక్కొక్క దానినే ఎత్తివేస్తున్నాయని, ఆక్రమంలోనే నేడు పేదలకడుపు కొట్టేవిధంగా పౌరసరఫరా రంగంలో సబ్సిడీ సరుకుల కోతను విధించిందని చెప్పారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా వచ్చే ఆదాయం చాలని నిరుపేద శ్రమజీవులు రేషన్ షాపులద్వారా వచ్చే సరుకులతో కలో, గంజో కాసుకొని బ్రతుకు బండినీడ్చుతున్నారని, కనీసం ఆపాటి అవకాశం కూడా లేకుండా చేయటానికి పాలకులు పూనుకున్నారని ఇది ప్రజల 'జీవించే హక్కు'ను లేకుండా చేయటమేనని అన్నారు. తక్షణం ప్రజలకవసరమైన బియ్యం, కందిపప్పు, నూనె మొదలు అన్నిరకాల నిత్యావసర సరుకులను, నెలకు సరిపడా నాణ్యమైన సరుకులను సబ్సిడీపై చౌక ధరలకే అందించాలని డిమాండ్ చేశారు.

ప్రపంచబ్యాంకు ఆదేశాలలో భాగంగా ప్రైవేటీకరణ, మార్కెట్ దోపిడీని ఉధృతంచేసి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేయబూనుకుంటున్న పాలకుల విధానాలను ప్రజలందరూ తమ సంఘటిత శక్తితో ఎదురించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥సుధాకర్, మల్లేష్, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥అంజమ్మ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✸

# సిరియాపై అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ ప్రకటనను ఖండించండి!

**"టెర్రరిజంపై** పోరు" పేరిట సిరియా, ఇరాక్‌లపై మరొక యుద్ధాన్ని 2014 సెప్టెంబరు 10న ఒబామా ప్రకటించాడు. "ఐఎస్ఐఎస్ ఉనికిలోవున్న చోటల్లా దాని పని పట్టేందుకు నిలకడైన, నిరంతరాయ దాడి సాగుతుంద"ని ఒబామా అన్నాడు. ఆవిధంగా అమెరికా సామ్రాజ్యవాదపు కొత్త సైనిక జోక్యానికి భౌగోళిక ఎల్లలు వుండవని ప్రకటించాడు. సిరియా, ఇరాక్‌లకే కాకుండా జోర్డాన్, లెబనాన్, సౌదీఅరేబియా, టర్కీలు కూడా రణరంగంగా మారబోతున్నాయి.

ఒబామా ఉపన్యాసం వెనువెంటనే సిరియాలోని అమెరికా మద్దతు గల "ప్రతిపక్షశక్తుల"కు సైనిక సహాయమూ, శిక్షణలిచ్చేందుకు ప్రణాళికలను ప్రకటించారు. ఐఎస్ఐఎస్‌కు ప్రధాన మద్దతుదారుగా వున్న సౌదీ అరేబియానే ఈ పథకాలను పర్యవేక్షిస్తుంది. అదనపు సైనిక బలగాలను పంపబోనని ఒబామా చెప్పినప్పటికీ, వందలాది అమెరికా సైనికులనూ, సలహాదారులనూ మధ్య ఆసియా ప్రాంతానికి పంపారు.

అమెరికా మద్దతు యిస్తానంటున్న ఈ "ప్రతిపక్షశక్తు"లెవరు? సెప్టెంబరు 12న 'న్యూయార్క్‌టైమ్స్' పత్రిక ప్రచురించిన ఒక వ్యాసంలో అమెరికా "మధ్యస్థవాదుల"ని ముద్రవేసిన "తిరుగుబాటు"దారులు ఐఎస్ఐఎస్(ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాక్ అండ్ సిరియా) తీవ్రభావాలతో ఏకీభవించి, దానితో కలిసి పోరాడుతున్న వారేననీ చెప్పింది.

'ది టైమ్స్' పత్రిక అంతర్జాతీయ శాంతికి కార్నీజీ నిధి అన్న సంస్థకు చెందిన అరున్‌లుండ్‌ను ఇలా ఉల్లేఖించింది. "శుభ్రమైన సరైన లౌకిక తిరుగుబాటు గ్రూపు మనం చూడలేము".

ఇరాక్, సిరియాలలో అమెరికా రాయబారిగా పనిచేసిన రైన్ క్రోకర్ మరింత సూటిగా మాట్లాడాడు: "ఐఎస్ఐఎస్‌కు చెందని ఈ ప్రతిపక్షమేదో కనుగొనటానికి మనం చేయగలిగినదంతా చేయాలి. సూటిగా చెప్పాలంటే నాకెలాంటి ఆధారమూలేదు".

నిజమే వారికెలాంటి ఆధారమూ కన్పించదు. ఎందుకంటే అమెరికా దాని మిత్రులు ధనమూ, ఆయుధాలు అందజేసిన అస్సాద్ వ్యతిరేక తిరుగుబాటు అన్నది సామ్రాజ్యవాద మద్దతుగల అభివృద్ధి నిరోధకశక్తి. దీనిలో అల్‌ఖైదా సంబంధాలున్న శక్తులున్నాయి. వాటిలో అతి పెద్దది ఐఎస్ఐఎస్.

ఇరాక్, లిబియా, సిరియాలలో అమెరికా సైనిక జోక్యంనుండి పుట్టినదే ఐఎస్ఐఎస్. దీనికి ధనమూ, ఆయుధాలను అమెరికానుండి చేరవేయటంలో సౌదీఅరేబియా కీలకపాత్ర పోషించింది. ఐఎస్ఐఎస్‌కు అమెరికా సహాయాన్ని సౌదీఅరేబియా, కతార్‌ద్వారా అందజేయటంతోపాటు టెర్రరిస్టులకు శిక్షణ, వారిని చేర్చుకోవటం, వారికి మతోన్మాద బోధచేయటమూ సాగించాయని ప్రముఖ పశ్చిమపత్రికలే తెలిపాయి.

లండన్‌నుండి వెలువడే 'డైలీ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఇలా అన్నది: "ఐఎస్ఐఎస్‌కు ధనమూ, ఆయుధాలను సౌదీఅరేబియా, కతార్ సరఫరా చేశాయి".

"కతార్, సౌదీవంటి మిత్రులద్వారా పశ్చిమదేశాలు సిరియాలోని మిలిటెంటు గ్రూపులకు మద్దతునిచ్చాయి. అవి ఈనాడు ఐఎస్ఐఎస్‌గా అవతరించాయి" (డైలీ టెలిగ్రాఫ్ 12-9-2014)

"ఉత్తర సిరియాలోని అలెప్పో నుండి ఇరాన్-ఇరాక్ సరిహద్దు వరకూ కొన్ని వందల చదరపు మైళ్లలో ఐఎస్ఐఎస్ ఆధీనంలో వుంది. దీనికి ధనాన్ని, ఆయుధాలను సౌదీవహాబీలు, కువాయిట్ పాలకులు అందించారు" (రాబర్ట్ ఫిస్క్, ది ఇండిపెండింట్ 12-9-2014).

2013లో టెర్రరిస్టులను రిక్రూట్ చేసే పనిలో భాగంగా మరణశిక్షపడిన ఖైదీలను సౌదీఅరేబియా విడుదల చేసింది. అధికారులు వారిముందు ఒక ప్రతిపాదన పెట్టారు: జైల్లో ఉండి ఉరిశిక్షకు గురౌతారా లేక బయటకువెళ్లి అస్సాద్ ప్రభుత్వంపై పోరాడుతారా? ఒప్పందంలో భాగంగా వారికి క్షమాభిక్ష పెడతారు. వారి కుటుంబాలకు నెలవారీ స్టైఫండు ఇస్తారు. యెమెన్, సౌదీఅరేబియా, సూడాన్, సిరియా, జోర్డాన్, సోమాలియా, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్టు, పాకిస్తాన్, ఇరాక్, కువైట్ జైళ్లనుండి ఖైదీలు విడుదలై సిరియాలో పోరాటంలో చేరారు.(గ్లోబల్ రిసెర్చ్ 11-9-2013).

"ఇరాక్, సిరియాలలో ఐఎస్ఐఎస్‌పై చర్య తీసుకునేందుకు నేనే మాత్రం వెనుకాడను" అని ఇప్పుడు ఒబామా గర్జిస్తున్నాడు. ఆయన అడుగుజాడల్లోనే సౌదీ రాజు, ఇతర గల్ఫ్‌దేశాల రాజులు ఐఎస్ఐఎస్‌పై ఒబామా సాగించే పవిత్ర యుద్ధానికి తమ మద్దతు పలికారు. వీరందరు నిన్నటివరకూ ఐఎస్ఐఎస్‌కు ఆయుధాలు అందజేశారు. ఐఎస్ఐఎస్ సృష్టికర్తలైన వీరందరూ తమ టెర్రరిస్టులను తామే వేటాడ బోతున్నామని ఇప్పుడు ప్రపంచ ప్రజలకు చెబుతున్నారు.

అమెరికా, సౌదీఅరేబియా, కతార్‌లు ఐఎస్ఐఎస్‌కు అందజేస్తున్న ఆర్థిక, ఆయుధ సహాయాన్ని ఆపబోవని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఒబామా వాగ్దానం చేసినట్లు ఐఎస్ఐఎస్‌ను మట్టుబెట్టడం వారి లక్ష్యం కాదు.

ఒబామా ప్రారంభించిన కొత్త యుద్ధపు నిజలక్ష్యం సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని కూలద్రోసి, తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచెయ్యటమే. గత ఏడాది సెప్టెంబరులో ఆపవలసివచ్చిన అస్సాద్ ప్రభుత్వంపై యుద్ధం చెయ్యాలన్న నిర్ణయాన్ని అమలుచేయటానికి, అదే సమయంలో ఇరాక్‌పై తన పట్టు బలీయం చేసుకోవటానికి ఐఎస్ఐఎస్ ఒక ముసుగు మాత్రమే. కొందరు అమాయకుల తలలు నరికి ఐఎస్ఐఎస్ తన యజమానికి ఒక సాకును అందజేసి సేవక పాత్రను నిర్వహించింది.

మధ్యప్రాచ్యంలో చమురు వనరులపై ఆధిపత్యం, ఆవిధంగా ప్రాంతంపై వ్యూహాత్మక ఆధిపత్యం పొందటం అమెరికా సామ్రాజ్యవాదుల అసలు లక్ష్యం.

వరుసగా అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షులంతా విదేశాలలోని సైనికులను వెనక్కు తీసుకొస్తామంటూ వాగ్దానం చేసినవారే. కానీ యుద్ధాలు సాగుతూనే వున్నాయి. మూడుసార్లు ఇరాక్‌పైనా, సోమాలియా, హైతీ, సూడాన్, సెర్బియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, లిబియా, సిరియా, యెమెన్ అమెరికా సైనికదాడి సాగిన వాటిలో కొన్ని దేశాలు. ఈవిధంగా అమెరికా సామ్రాజ్యవాదం తన స్వభావాన్ని నగ్నంగా బయటపెట్టుకుంది. 'సామ్రాజ్యవాదం పరాన్నభుక్కు, క్షీణదశ; ప్రపంచ పునర్విభజన కొరకు యుద్ధోన్మాది' అన్న లెనిన్ మాటలను మరోసారి అక్షర సత్యాలని నిరూపించింది.

కొత్తయుద్ధ ప్రకటనతో అమెరికా సామ్రాజ్యవాదం మధ్యప్రాచ్యం, అమెరికా, ప్రపంచ దేశాలలోని కార్మికవర్గానికి సవాలు విసిరింది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో జాతీయ విమోచనా ఉద్యమాలకు బాసటగా నిలవటం, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి పూనుకొనటమన్న కర్తవ్యాన్ని చేపట్టడంద్వారా ప్రపంచ కార్మికవర్గం ఈ సవాలు నెదుర్కోవాలి.

ఇరాక్, సిరియాలపై అమెరికా సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రకటనను ప్రపంచ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలి!

కేంద్రకమిటి
సిపిఐ(ఎం.ఎల్)

15-9-2014

# 'న్యాయస్థానాలకు జవాబుదారీతనం ఉండితీరాలి'

**- 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి' ఛైర్మన్ బొజ్జాతారకం**



ప్రాంతీయ సదస్సులో ప్రసంగిస్తున్న పి. అంజయ్య; వేదికపై బొజ్జాతారకం, ఎస్.ఝాన్సి, తదితరులు; పుస్తకావిష్కరణ

**తిరుపతి, 13-9-14 :**

ఇతర ప్రభుత్వ వ్యవస్థలమాదిరిగానే న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం అవసరమని ప్రముఖ న్యాయవాది, చుండూరు దళితుల న్యాయ పోరాటకమిటి ఛైర్మన్ బొజ్జాతారకం వ్యాఖ్యా నించారు. 13-9-2014 శనివారం తిరుపతిలోని నగరపాలక సంస్థ ఆవరణలో "జడ్జీల నియామకం - వారి జవాబుదారీతనం" అనే అంశంపై 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటీ' ప్రాంతీయ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా తారకంగారు మాట్లాడుతూ ప్రాచీనకాలంలో రాజులు చెప్పిన తీర్పులే న్యాయంగా చలామణి అయ్యాయని అన్నారు. అయితే నేటి స్వతంత్ర దేశంలో కూడా జడ్జీల తీర్పు రాచరిక వ్యవస్థను తలపిస్తోందన్నారు. అంతేగాక ప్రపంచంలో ఎక్కడాలేనివిధంగా ఇక్కడ జడ్జీల నియామకాన్ని జడ్జీలే చేపట్టడం విచిత్రంగా ఉందన్నారు. న్యాయ వ్యవస్థలో రాజకీయ ప్రభావం పెరిగిందని అవినీతి, కులం, ధనం న్యాయవ్యవస్థను నడిపిస్తున్నాయని అన్నారు. సంపన్నులు జడ్జీలను నియమించుకుని శిక్ష నుండి తప్పించుకుంటుంటే, పేదలు మాత్రం జైళ్ళపాలవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను కూడా ప్రజలు ప్రశ్నించే అధికారం రాజ్యాంగం కల్పించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గానీ నేడుగానీ దళితులు ఏదో ఒకచోట అనునిత్యం దాడులకు గురవుతున్నారని, కారంచేడు, వేంపెంట, చుండూరు, పదిరికుప్పం, నీరుకొండ, లక్ష్మింపేట వరకు దాడులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే న్యాయవ్యవస్థ మాత్రం అన్నిచోట్ల అగ్రవర్ణాల పక్షం వహించిందన్నారు. నేటికీ దళితులకు బ్రతుకు ఆసరాను కల్పించే భూమి వాళ్ళ చేతుల్లో లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ దోపిడీ పాలక వర్గాలు పనిగట్టుకుని దళితులపై దాడులు సాగిస్తున్నాయని చుండూరు సంఘటనలో కూడా అగ్రవర్ణాలకు అన్నివిధాల సహకారాలందించి ఒక పథకం ప్రకారం దళితులపై నరమేథం సాగించారని, ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిన ఘటనకాదని తెలిపారు. ముస్లిం మైనార్టీలపై గుజరాత్‌లో గోద్రా సంఘటనను బూచిగా చూపెట్టి నరేంద్రమోడీ ఊచకోత సాగించాడని, వేలాదిమంది పసిపిల్లలను, మహిళలను, వృద్ధులను పొట్టన పెట్టుకున్న వాడు, నేడు దేశానికి ప్రధానమంత్రి కావడం సిగ్గుచేటన్నారు. ఉత్తరప్రదేశ్‌లో వరుసగా మహిళలపై అత్యాచారాలు జరుపుతున్న సంఘటనల్లో పైకి ములాయంసింగ్ ప్రభుత్వాన్ని నిందిస్తూ రాజకీయంగా లబ్ధిపొందే ప్రయత్నంలో బిజెపి పాలకులు వున్నారన్నారు. కుల, మత ఉన్మాదాలను ప్రేరేపిస్తున్న దోపిడీ పాలకులకు, వారికి వత్తాసుగా నిలుస్తూన్న న్యాయస్థానాల బూటకత్వంపై ప్రజల్లో చర్చజరగాలన్న ఉద్దేశంతో రెండు తెలుగు రాష్ట్రాలలో తిరుపతితోపాటు విజయవాడ, విశాఖపట్నం, వరంగల్‌లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని, 'చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటి' భావించిందన్నారు. దళిత, పేద, రైతుకూలీ ప్రజానీకం సంఘటిత ఉద్యమాలను నిర్మించినపుడే దోషులకు శిక్షలుపడేలా చేయవచ్చని, దళితులు ఆత్మగౌరవంతో జీవించే స్థితిని నెలకొల్పవచ్చని తెలిపారు.

ఈ సదస్సులో కులవివక్ష పోరాట కమిటి నాయకులు కందారపు మురళి, ఏఐకెఎమ్‌కెఎస్ రాష్ట్ర నాయకులు కా॥ ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ పట్టణ నాయకులు చిన్నం పెంచలయ్య, సోషిత్ జనసభ నేత కె. రామలింగం, బి.సి. సంక్షేమ సంఘం నేత ఆల్మెన్‌రాజు, బాస్ వ్యవస్థాపకులు పిటిఎమ్.రాజు, ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు తిమ్మారెడ్డి, పౌరహక్కుల సంఘంనేత ఎమ్. ప్రసాద్‌లు మాట్లాడగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు పి. అంజయ్య అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. రాయలసీమ జిల్లాలతోపాటు, నెల్లూరు జిల్లానుండి 5 వందల మంది ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు.

ఈ సదస్సులో 'దళితశక్తి' మాసపత్రికతో పాటు, 'మంచి మనిషీ, మార్గదర్శీ - గొర్రెపాటి నరేంద్రనాథ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ✡


## ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో

**2014 అక్టోబర్ 11, 12 తేదీలలో హైదరాబాద్‌లో**



# అఖిల భారత కార్మిక సదస్సును జయప్రదంచేయండి

**సామాజిక మార్పుకోసం, ప్రజాస్వామిక వ్యవస్థ కోసం, కార్మిక హక్కుల కోసం సమైక్య, సంఘటిత కార్మికోద్యమాన్ని నిర్మిద్దాం!**


Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010